
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 17 డిసెంబరు 2024

24న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక, ఆర్థిక, పనులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అరుణమ్మ అధ్యక్షతన జరిగే సమావేశాలకు సభ్యులంతా హాజరు కావాలని కోరారు.



పోలీస్ స్పోర్ట్స్ మీట్..

విజేతలతో ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

ఓవరాల్ చాంపియన్ డీఏఆర్

● ఉత్కంఠగా సాగిన ఫైనల్స్ ● క్యాంపైర్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసులు

నెల్లూరు (క్రైం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న జిల్లా పోలీసు వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 సోమవారం ముగిసింది. అనేక క్రీడల్లో పోలీసులు నువ్వానేనా అంటూ తలపడ్డారు. పోటీలు చివరి దశకు చేరుకోవడంతో ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. 126 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను జిల్లా ఏఆర్ విభాగం కైవసం చేసుకుంది. పురుషుల చాంపియన్ షిప్‌ను 23 పాయింట్లతో డీఏఆర్‌కు చెందిన ఏఆర్‌పీసీ 1818 ఎస్ అంకయ్య కైవసం చేసుకోగా, మహిళల చాంపియన్ షిప్‌ను 26 పాయింట్లతో

- మిగతా 6లో..



కుడి కాలువ తూము గోడలను పగలగొడుతున్న ఇరిగేషన్ సిబ్బంది

2 రోజుల్లో గేటు తొలగిస్తాం!

- 'రాళ్లపాడు' వద్ద ప్రకాశం జిల్లా సీఈ వెల్లడి
- తూము గోడలు పగలగొట్టిన అధికారులు
- కుడికాలువకు వంద క్యూసెక్కుల నీరు విడుదల
- రెండవ రోజూ కొనసాగిన రైతుల ఆందోళన

6 లో..



భక్తిశ్రద్ధలతో ధనుర్మాసం సోమవారం ప్రారంభమైంది. ప్రతి ఇంటి ముంగిట రత్నాల ముగ్గులు వేసి శ్రీమహాలక్ష్మిని ఆహ్వానించారు. అలాగే జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవికి శ్రీకృష్ణస్వామిలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. నెల్లూరులోని ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో సోమవారం రాత్రి తిరుప్పావై పారాయణం, భజనలు జరిగాయి.

సిటీ ప్లానింగ్ అధికారిపై వేటు

డైరెక్టర్ కార్యాలయానికి కృష్ణ కిశోర్ సరెండర్

మరో ఇద్దరు ప్లానింగ్ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు (సిటీ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానింగ్ అధికారి కృష్ణ కిశోర్‌ను టౌన్ ప్లానింగ్ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయానికి సెరెండర్ చేస్తూ కమిషనర్ సూర్య తేజ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భవన నిర్మాణాల విషయంలో కృష్ణకిశోర్ పనితీరు ఆశాజనకంగా లేదని, కఠినంగా వ్యవహరించలేకుండా ఉన్నారంటూ కమిషనర్ పేర్కొన్నారు. అలాగే ఇద్దరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలపైనా

- మిగతా 6లో..

వైభవంగా సింహపురి యునైటెడ్ క్యారెల్స్

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 16వ సింహపురి యునైటెడ్ క్యారల్స్ వైభవంగా జరిగింది. నగరంలోని క్రైస్తవ సంఘాలన్నీ సంయుక్తంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఏబీఎం కాంపౌండ్‌లో నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం, సింహపురి అసోసియేట్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, డానీ హాలు పాస్టర్ కె.శ్యాంసన్ కుమార్ తదితరులు దైవ ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు, బెలూన్స్‌తో ర్యాలీని ప్రారంభించారు. బట్వాడి పాలెం సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా డేవిడ్ దయాసాగర్, పి.జానీజో, క్వయర్ డైరెక్టర్‌గా బెల్లి శ్యాంసన్, డైరెక్టర్‌గా మౌంట్‌బాటన్ వ్యవహరించారు.



జూడో సైన్యం
జిల్లా జట్ల ఎంపిక



కావలి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూడో జిల్లా అడ్‌హక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్తసత్రం జెడ్పీ హైస్కూల్ పాఠశాల ప్రాంగణంలో బాల, బాలికల జూడో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షులు మురళి పర్యవేక్షణలో జరిగిన ఎంపికలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడారు. జూడో ప్రాచీన క్రీడ అని మల్ల యుద్ధాన్ని పోలివుండే ఇలాంటి పోటీలకు ఎంపికలు నిర్వహించడం విద్యార్థులకు ఈ క్రీడల పట్ల మక్కువ పెరుగుతుందన్నారు. ఎంపికలో జిల్లావ్యాప్తంగా 80మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన వారు 21, 22 తేదీల్లో విజయవాడలో జరగనున్న అంతర్ జిల్లాల జూడో పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

అచ్చొచ్చిన స్కూటర్‌పై రయ్.. రయ్...!




ఈయన్ను గమనించారా!?. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. అదేంటి సాదాసీదాగా పాతకాలంనాటి బజాజ్ చేతక్ స్కూటర్‌లో వస్తున్నాడని అనుకుంటున్నారా!? అవును... ఆ బండి ఆయనదే. శ్రీధర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది ఈ స్కూటర్‌పైనే. అపురూపమైన ఆ జ్ఞాపకాన్ని భద్రంగా దాచిపెట్టుకున్నారు. తాజాగా ఆ స్కూటర్‌కు మరమ్మతు చేయించి తన పాతస్మృతులను నెమరు వేసుకుందామని ఇదిగో ఇలా చేతక్ ఎక్కి నడుపుతూ మాగుంట లేఅవుట్‌లోని తన ఇంటి నుంచి కేవీఆర్ కూడలి వద్దనున్న కార్యాలయానికి వచ్చారు. ఈ సన్నివేశాన్ని ఎమ్మెల్యే అభిమానులు, అనుచరులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా అదికాస్త వైరల్ అయ్యింది.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

పట్టుదలతో ఎదిగి.. పతకాలు సాధించి!

షార్ట్‌పుట్ బాల్, జావెలిన్ త్రో క్రీడల్లో చంద్రశేఖర్ ఘనత

జిల్లా నుంచి జాతీయ స్థాయిలో రాణింపు ● ఆర్టీసీలో కొలువుకు దోహదపడిన క్రీడా సామర్థ్యం



ప్రతిభ PRATIBHA

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా నేపథ్యం లేని కుటుంబం నుంచి జాతీయస్థాయి క్రీడల్లో పతకాలు సాధించే వరకు ఎదిగి గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలిచాడు ఉలవపాడుకు చెందిన ఈర్ల చంద్రశేఖర్. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈయన కష్టపడి చదివి క్రీడల్లో తన ప్రతిభను నమ్ముకొని ఏపీఎస్ ఆర్టీసీలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.

● చిన్ననాటి నుంచే..

చంద్రశేఖర్ బాల్యం, విద్యాభ్యాసం తన అమ్మమ్మ ఊరు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం జమ్ములపాలెం ఉన్నత పాఠశాలలో సాగింది. చంద్రశేఖర్‌లోని ప్రతిభను ఉపాధ్యాయుడు పులివర్తి బసవయ్య గుర్తించి షార్ట్‌పుట్ బాల్, జావెలిన్ త్రో ఆటల్లో శిక్షణ ఇచ్చారు. స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటూ మెరుగైన ప్రతిభ చూపి పాఠశాలకు ట్రోఫీలు సాధించి పెట్టాడు. పాఠశాల విద్యాభ్యాసంలోనే రాష్ట్ర లైక్వాండో పోటీల్లో కూడా పాల్గొని మెడల్ సాధించాడు. ఆ తర్వాత సింగరాయకొండ గౌతమ బుద్ధ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తయిన వెంటనే హోంగార్డు ఉద్యోగం సాధించాడు. హోం గార్డుల స్టేట్ క్రీడా పోటీల్లో కందుకూరు డివిజన్ స్థాయిలో 100మీటర్ల పరుగు పందెం, హై జంప్, షార్ట్‌పుట్ బాల్‌లో మెరుగైన ప్రతిభ కనబర్చి కందుకూరు డివిజన్‌ను ప్రథమ స్థానంలో నిలిపాడు.



డీజీపీ, ఆర్టీసీ చైర్మన్ నుంచి అవార్డు అందుకుంటూ..

సాధించిన పతకాలు...

- 2011లో ఆర్టీసీ కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలైన క్రమంలో క్రీడా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో 2012 ఉద్యోగానికి అర్హత పొంది శిక్షణ పొందారు. అనంతరం కావలి ఆర్టీసీ డిపోలో తొలిసారి చంద్రశేఖర్ విధుల్లో చేరారు.
- 2014లో అనంతపురంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని జావలిన్ త్రో, షార్ట్‌పుట్ బాల్, డిస్కస్‌త్రో విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడమే కాకుండా ఓవరాల్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ మెడల్ కూడా కైవసం చేసుకున్నారు.
- 2024 ఆగస్టులో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయిలో షార్ట్‌పుట్ విభాగంలో బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- డిసెంబరు 6,7,8 విశాఖపట్నంలో జరిగిన ఆర్టీసీ క్రీడల్లో షార్ట్‌పుట్‌బాల్ పోటీలో రజిత పతకంతో జాతీయస్థాయిలో మెరిశాడు.
- ఆర్టీసీ ఎండీ, ప్రస్తుతం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమరావు, ఆర్టీసీ చైర్మన్ కానకాళ్ల నారాయణరావు చేతుల మీదగా మెడల్, జ్ఞాపికను అందుకున్నారు. ఆర్టీసీలో నిబద్ధత కలిగిన ఉద్యోగిగా చంద్రశేఖర్ పేరు సంపాదించారు. ఉలవపాడులో యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు కొనియాడుతున్నారు.

కలెక్టర్ చెబుతున్నా...

హెల్మెట్ ధారణపై ప్రజలకు రవాణా, పోలీసు అధికారులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా, వాహనదారుల్లో మార్పు రావడం లేదు. రాష్ట్రంలో హెల్మెట్ నిబంధన అమలుపై మూడు రోజుల క్రితం హైకోర్టు, పోలీసు, రవాణా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో జిల్లా అధికారులు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరింపచేసే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే ప్రతి నెలా జరిగే రోడ్డుప్రమాదాల సమీక్షలో కలెక్టర్, ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు పదేపదే సూచిస్తున్నారు. అయినా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

ప్రమాదాల బారిన యువత

ద్విచక్రవాహనాలు నడుపుతూ రోడ్డుప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. దాదాపు 80 శాతానికిపైగా యువత జిల్లాలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో ఎక్కువగా యువతే ఉంటున్నట్లు అధికారులు తెలియచేశారు. రూ. లక్షలు విలువ చేసే బైక్‌లు కొంటు న్న యువత రూ. వందల విలువ చేసే హెల్మెట్ కొనుగోలు చేసి వాడేందుకు ముందుకు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

- శిరస్త్రాణం లేకుంటే ప్రాణాపాయమే
- హైకోర్టు ఆదేశాలతో కనువిప్పు కలిగేనా!?

యువత మేలుకో.. హెల్మెట్ పెట్టుకో !



నెల్లూరు (క్రైం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి వేగానికి ఉన్న ప్రాధాన్యతను భద్రతకు ఇవ్వడం లేదు. దీంతో భారీ మూల్యం చెల్లించుకోక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం మూలంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. జిల్లాలో ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్లే అధికంగా జరుగుతున్నాయి. గత మూడేళ్లలో వందలాది మంది అక్కడికక్కడే మృతి చెందినా, గాయాలపాలైన గణాంకాల పరిస్థితి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఓ పక్క పోలీసు అధికారులు, మరో పక్క రవాణాశాఖ అధికారులు ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని పదే పదే చెబుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.



హెల్మెట్ లేకుండా బైక్‌పై ముగ్గురు యువకులు

జిల్లాలో ద్విచక్రవాహనాల ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు	చలానాలు
2022	305	126	265	రూ.2,45,818
2023	306	148	302	రూ.1,19,969
2024	250	140	195	రూ.29,728

నెల్లూరు నగర పరిధిలో ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు	చలానాలు
2022	48	20	30	రూ.84,684
2023	52	16	51	రూ.19,226
2024	50	24	43	రూ.3,784

సొంతూరుకు వెళుతూ పరలోకాలకు..

నెల్లూరు(క్రైం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సొంతూరుకు బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నెల్లూరు నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. ఉలవపాడు మండలం భీమవరానికి చెందిన రామకృష్ణ(41)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన కుటుంబంతో పాటు తొమ్మిదేళ్ల క్రితం సర్వేపల్లికి వచ్చి బేల్దారు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సోమవారం ఉదయం సొంతూరులో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయలుదేరిన ఆయన జాతీయ రహదారిపై వస్తుండగా సరిగ్గా ఎన్టీఆర్ నగర్ ఎస్వీజీఎస్ కళాశాల వద్దకు వచ్చేసరికి వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీరిచ్చేవరకు తగ్గేదేలా..!

- 'రాళ్లపాడు' వద్ద కొనసాగిన రైతుల ఆందోళన
- రెండు రోజుల్లో దెబ్బతిన్న గేటు తొలగిస్తాం : సీఈ

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము నుంచి త్వరగా నీరిచ్చి ఆదుకోవాలని కోరుతూ రెండవ రోజు సోమవారం కూడా రైతులు ఆందోళన కొనసాగించారు. ఉదయం 11 గంటలకు చినపవని, పెదపవని, అన్నెబోయినపల్లి, భీమవరప్పాడు, శాయిపేట, మక్కెనవారిపాలెం గ్రామాల రైతులు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. రూ.లక్షలు పోసి సాగు చేసిన వరినార్లు, వరినాట్లు ఎండి పోతున్నాయని, త్వరగా నీరివ్వాలంటూ అధికారులతో వాదనకు దిగారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అక్కడున్న ప్ర కాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మితో వాదనకు దిగారు. అనంతరం రోడ్డుపై బైఠా యించారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రోడ్డుకు బైక్‌లను అడ్డుపెట్టి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బస్సుల్లోని ప్రయాణికులు తాము ఇబ్బంది పడుతున్నామని రైతులతో అనగా, వారు ఆందోళన విరమించారు.

● నివేదిక సిద్ధం చేయండి : దివి శివరాం

అంతకముందు ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తూము వద్ద జరుగుతున్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఎస్ ఈ వరలక్ష్మితో మాట్లాడారు. వెంటనే కాలువకు సాగునీరు ఇవ్వాలని కోర డంతోపాటు అధికారులు, సిబ్బంది లేకుండా ప్రాజెక్టు నిర్వహణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు ఏమేమి అవసరమో జాబితా తయారు చేసి తనకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు అందజేస్తే, తాము సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ఎస్ఈ వరలక్ష్మితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

● కాలువలో వంద క్యూసెక్కుల నీరు

అయితే కుడి కాలువ తూములో దెబ్బతిన్న గేటు పైకి రాకపోవడంతో ఎస్ఈ వరలక్ష్మి ఆధ్వర్యంలో డీఈఈ ఎం వెంకటేశ్వర్లు ఇతర అధికారులు, సిబ్బంది కంప్రెషర్ ద్వారా దెబ్బతిన్న స్టాప్‌లాక్ గేటుకు, సర్వీసు గేటు మధ్యలో ఉన్న గోడలను పగలగొట్టారు. దీంతో నీరు తూములోని బావిలోకి వెళ్లి అక్కడ నుంచి కాలువలోకి పారుతోంది. అలాగే సైఫన్ పద్ధతిలోనూ నీరు పంపిస్తుండగా, ప్రస్తుతం కాలువలో 90 నుంచి 100 క్యూసెక్కుల మేర నీరు ప్రవహిస్తున్నట్టు డీఈఈ తెలిపారు. కాగా, సాయంత్రం 6 గంటల సమయంలో ప్రకాశం జిల్లా సీఈ శ్యాంప్రసాద్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థ బెకామ్ సాంకేతిక నిపుణులు పరశురాంరెడ్డి, మరికొందరు సాంకేతిక నిపుణులు కుడి కాలువ తూము గేట్లను పరిశీలించారు. సీఈ మాట్లాడుతూ రెండు రోజుల్లో దెబ్బతిన్న గేటును తొలగించి నీరిస్తామన్నారు.

అధికారుల అలసత్వం లేదు : ఎస్ఈ

రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ స్టాప్‌లాక్ గేటు మరమ్మతు పనుల్లో అధికారుల అలసత్వం లేదని ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులకు గురైన విషయం తమకు తెలిసిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి రాష్ట్రస్థాయి సాంకేతిక నిపుణులను రప్పించి, అన్ని రకాల ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు రోజుల వ్యవధిలో రిప్యూటెడ్ కంపెనీ ద్వారా గేటును ఎత్తి పూర్తి స్థాయిలో నీటిని ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గేటును బాగు చేసి రైతులకు నీరిచ్చేందుకు పది రోజులుగా శ్రమిస్తున్న అధికారులను నిందించడం సరికాదని పేర్కొన్నారు.



రోడ్డుపై వాహనాలు అడ్డుపెట్టి ఆందోళన చేస్తున్న రైతులు

విద్యుదాఘాతంతో హేచరీ ఓనర్ మృతి

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కరేడు పంచాయతీ పరిధిలోని బట్టియ సోమయ్య పాలెం గ్రామ సముద్ర తీర ప్రాంతంలో సోమవారం విద్యుదాఘాతంతో సంధ్య హేచరీ నడుపుతున్న శ్రీకాకుళం జిల్లా బత్తిలి గ్రామానికి చెందిన కొంపల శ్రీనివాస రావు (45) మరణించాడు. హేచరీకి నీటి సరఫరా కోసం మోటార్లు స్విచ్ ఆన్ చేసేందుకు సముద్రం ఒడ్డున నిర్మించిన మోటార్ల షెడ్ వద్దకు వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో తోటి పనివాళ్లు వెళ్లి చూడగా శ్రీనివాస రావు విగత జీవుడై ఉండటాన్ని గమనించి ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన విద్యుత్ షాక్‌తో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ అంకమ్మ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్ఏ-1 గణితం ప్రశ్నపత్రం లీక్!

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అస్సెస్మెంట్ (ఎస్ఏ-1) సోమవారం జరగాల్సిన గణితం పరీక్ష పేపర్ లీక్ కావడంతో వాయిదా పడింది. 1 నుంచి 10వ తరగతి వరకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతున్నాయి. ఎంఈవో కార్యాలయాలకు ప్రశ్నపత్రాలు చేర్చగా, అక్కడ నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సబ్జెక్టు వారీగా గంట ముందు పాఠశాలలకు తీసుకెళ్తారు. ఈ క్రమంలో సోమవారం జరగాల్సిన గణితం పేపరు ముందురోజు ఆదివారం వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చక్కర్లు కొట్టింది. దీంతో 6 నుంచి 10వ తరగతుల గణితం పరీక్ష వాయిదా వేయాలని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు ఎంఈవో-2 రమణయ్య తెలిపారు. మంగళవారం నుంచి జరగాల్సిన సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. కాగా, వాయిదా పడిన గణితం పరీక్షను 20వ తేదీన నిర్వహించనున్నట్లు సమాచారం.

● వాస్తవాలు వెలికితీయాలి : పీఆర్టీయూ

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : గణితం ప్రశ్నపత్రాన్ని వాట్సాప్‌కు పంపిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి నాటకం తిరుమలయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సైబర్ నేరగాళ్ల వల్ల లీక్ అయిందా, అధికారులే లీక్ చేశారా అన్న అంశాలపై వాస్తవాలను వెలికితీయాలన్నారు.



ఉదయగిరి : పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు అప్పగిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు



పరుగు పందెంలో మహిళా పోలీసులు

ఓవరాల్ చాంపియన్ డీఏఆర్

(5వ పేజీ తరువాయి)

ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ 1956 ఎ చందన దక్కించుకుంది. పలు పోటీల్లో హోంగార్డులూ ప్రతిభ కనపరిచారు. అనంతరం విజేతలుగా నిలిచిన పోలీసులకు, హోంగార్డులక ఎస్పీ జీ కృష్ణకాంత్ బహుమతులు ప్రదానం చేశారు. గెలుపోటములను ఒకేలా తీసుకుంటూ అందరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యాంప్ ఫైర్‌లో అధికారులు, సిబ్బంది అన్న తేడా లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు.

సిటీ ప్లానింగ్ అధికారిపై వేటు

(5వ పేజీ తరువాయి)

వేటు వేశారు. చిల్డ్రన్స్ పార్కు వద్ద నివా హాస్పిటల్ నిర్మాణంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఇందులో బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం వహించిన 17/1 సచివాలయంలోని సెక్రటరీ టీ రాఘవేంద్రరావును విధుల నుంచి తప్పించారు. సమీప సచివాలయ కార్యదర్శి సుధీర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని టీపీబీవో కే వెంకటేష్‌ను ఆదేశించారు. కాగ రవీంద్రనగర్‌లో (21/1) అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించిన కమిషనర్ ఇందుకు బాధ్యుడైన స్థానిక ప్లానింగ్ సెక్రటరీ ఎన్ వెంకట కిషోర్‌ను విధులు నుంచి తప్పించి సమీప సచివాలయ కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.




వీరులకు వందనం

వీరులారా వందనమంటూ మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జెండాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1971లో భారత్-పాక్ యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించి విజయ్ దివాస్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, రమణరాజు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ వైస్ చైర్మన్‌గా జస్టిస్ అప్పారావు

వెంకటాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ వైస్ చైర్మన్‌గా విశ్రాంతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ అప్పారావును హైకోర్టు నియమించినట్లు ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన గొలగమూడిలో ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో ఆశ్రమ కమిటీ వైస్ చైర్మన్‌గా ఉన్న నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి అనారోగ్యం కారణంగా రాజీనామా చేసినందున జస్టిస్ అప్పారావును హైకోర్టు నియమించింది.



ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ అప్పారావు

వైభవంగా అన్నాభిషేకం

సంగం సంగమేశ్వరాలయంలో సోమవారం ధనుర్మాసం, ఆరుద్ర నక్షత్రం, శివ ముక్కోటిని పురస్కరించుకుని గర్భగుడిలోని, పాతాళగంగ శివలింగానికి అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు crime news ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన చలిమంట

● వృద్ధుడి సజీవ దహనం

మనుబోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏడు పదుల వయసు...మసక మసకగా కనిపిస్తున్న కళ్లు.... నా అన్నవాళ్లు ఎవరూ దగ్గర లేరు... మూడురోజులుగా ఒక్కడే బిక్కు బిక్కుమంటూ పూరింట్లో జీవనం... పైగా కరెంటు కూడా లేదు. అర్ధరాత్రిలో వేసుకున్న చలిమంట ఆ వృద్ధుడిని బలిగొంది. ఈ సంఘటన మనుబోలులో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, స్థానిక చంద్రమౌళినగర్ గిరిజనకాలనీలోని రేకుల ఇంట్లో అంబి సుబ్బయ్య (73) నివసిస్తున్నాడు. కాళ్లు సాగిన రోజు చేపల వేటకు వెళ్లడం, అమ్ముకుని తినడం, నెలకు వచ్చే పింఛన్ డబ్బుతో కాలం గడుపుతున్నాడు. చాలనిరోజు ఇళ్లిళ్లు యాచిస్తూ కడుపు నింపుకునేవాడు. భార్యబిడ్డలు లేరు. తమ్ముడి కొడుకును దత్తు తీసుకుని చూసుకుంటున్నాడు. మూడురోజుల క్రితం తమ్ముడి కుమారుడు, ఆయన భార్య బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తలుపుకూడా లేదు. అర్ధరాత్రి చలికి తట్టుకోలేక వసారాలోకి వచ్చి చలి మంట వేసుకున్నాడు. ఈ క్రమంలో మంటలు వసారాను కమ్మేయడంతో ఒక్కసారిగా సుబ్బయ్య అల్లాడిపోయాడు. అరిచేందుకు నోరు పెగలకపోవడంతో మంటల్లోనే సజీవ దహనమయ్యాడు. మంటలు ఎగసి వసారాలోంచి ఇంట్లోకి వ్యాపించడంతో సామగ్రి కాలిపోయింది. స్థానికులు గమనించి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే సుబ్బయ్య బూడిద ముద్దగా మిగిలాడు. సమాచారం అందుకున్న సీఐ శివరామకృష్ణారెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బంధువులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. శవపంచనామా ముగించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా సుబ్బయ్య మరణవార్త తెలుసుకున్న సేవానాధం ట్రస్టు సభ్యులు ఆయన ఇంటికి చేరుకున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు రూ. 5వేలు ఆర్థికసాయాన్ని సుబ్బయ్య బంధువులకు అందజేశారు.



మంటల్లో కాలిపోయిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్టు

● ఆభరణాల స్వాధీనం

కావలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండున్నర సవర్ల గొలుసు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఉదయగిరి సీఐ వెంకట్రావు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డితో కలిసి సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. కావలి సబ్ డివిజన్ పరిధిలోని ఉదయగిరి మండలం గడ్డంవారిపల్లె కోదారి పద్మావతి ఈ నెల 13న సాయంత్రం మంచినీరు తీసుకుని వెళుతుండగా ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో గొలుసు లాక్కొనే ప్రయత్నం చేశారు. ఆమె ప్రతిఘటించటంతో ఒకరు చేతులు వెనుకకు పట్టుకుని మరో ఇద్దరు మెడను నొక్కి గాయపరిచి గొలుసు లాక్కొని మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. వారిని గ్రామస్థులు వెంబడించినా దొరక్కుండా అడవిలోకి వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉదయగిరి పోలీస్‌లు రెండు టీంలు వెళ్లి వారి కోసం గాలించారు. అయితే వారు పరారైనపుడు కొందరు తీసిన వీడియోలు, గ్రామస్థులు ఆ ప్రాంత విలేకరులు సాయంతో దుత్తలూరు మండలం సోమలరేగడ వద్ద వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ముగ్గురు గుంటూరు పట్టణానికి చెందిన షేక్ ఆరీఫ్, సేక్ నాగూరుబాష, లక్ష్మీ నరసింహంలుగా గుర్తించారు. వారిలో ఇద్దరు పాత నేరస్థులు కావటం వారిలో ఆరీఫ్ అనే వ్యక్తి గడ్డం వారిపల్లెలో ఇంటిపని నిమిత్తం వచ్చి గ్రామంలో పెద్దగా జనసంచారం లేని విషయాన్ని మిగిలిన ఇద్దరికి సమాచారం ఇచ్చారు. దీంతో ముగ్గురు కలిసి నేరానికి పాల్పడ్డారు. నిందితులను పట్టుకోవటంలో సీఐ, ఎస్ఐలకు సహకరించిన పోలీస్ సిబ్బంది ప్రసాద్, చెన్నయ్య, అనిల్, ప్రభాకర్, ప్రశాంత్, శ్రీనివాసులు, పండరీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

ధనుర్మాసం ప్రారంభం

● భక్తిశ్రద్ధలతో తిరుప్పావై పారాయణం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధనుర్మాసం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి ఇంటి ముంగిట రత్నాల ముగ్గులతో శ్రీమహాలక్ష్మిని ఆహ్వానించారు. జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి, శ్రీకృష్ణస్వామిలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరుప్పావై పారాయణం, ఊంజల్‌సేవలు, తదితర ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు నగరంలో మహిళలు, యువతులు ధనుర్మాసంను ఆహ్వానిస్తూ తమ గుమ్మాల ముందు ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు అలంకరించి సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గోదాదేవికి విశేష పూజలు, అనంతరం తిరుప్పావై పారాయణం జరిగాయి. మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల్‌స్వామి ఆలయంలో గోదాదేవికి విశేష పూజలు జరిగాయి. రాత్రి కనుల పండువగా ఊంజల్‌సేవ జరిగింది. ఉస్మాన్‌సాహెబ్ పేట కోదండరామస్వామి ఆలయంలో ఉదయం విశేష పూజలు, సాయంత్రం గుండాల గురవయ్య, భజన మండళ్ల ఆధ్వర్యంలో సామూహిక తిరుప్పావై పారాయణం, భజనలు జరిగాయి. మహాత్మ గాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో ధనుర్మాస పూజలు, తిరుప్పావై సేవాకాలం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మాగుంట లే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి, గోదాదేవికి తెల్లవారుజామున తిరువారాధన, సహస్ర నామార్చన, తిరుప్పావై, మంగళశాసనం జరిగాయి. సాయంత్రం 6గంటలకు తిరుప్పావై ప్రవచనం జరిగింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7372
వెండి కిలో ధర	రూ. 92,100
వెండి ఒక గ్రాము	రూ.95.10

కోర్టు కేసుల పరిష్కారంపై దృష్టి సారించండి

● కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ శంకరన్ హాల్లో సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడి యో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖలో కోర్టు కేసుల పరిష్కారం గురించి కిందిస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు పరుగో.. పరుగు..!

● 244 మంది అర్జీలు సమర్పణ

● స్వీకరించిన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో స్వీకరిస్తున్న అర్జీలకు పరిష్కారం దొరకకపోవడంతో అర్జీదారులు కలెక్టరేట్‌కు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మండలస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించినా ప్రయోజనం ఉండటం లేదు. జిల్లాలో భూ సమస్యలు విపరీతంగా ఉండటంతో ప్రభుత్వం ముందుగా గ్రామసభలు నిర్వహించింది. ఆ సభల్లో సర్వే రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వేల సంఖ్యలో అర్జీలు వచ్చాయి. అయినా ఆ అర్జీలకు పరిష్కారం లభించకపోవటంతో తాజాగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను పెట్టి ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించాలని సూచించింది. దీంతో గ్రామాల్లో భూసమస్యలపై అర్జీలు స్వీకరించే కార్యక్రమం కొనసాగుతోంది. ఏరోజుకారోజు పరిష్కరించిన అర్జీల సమాచారం.. పరిష్కారం కాని అర్జీల సమాచారాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు, జిల్లా అధికారులు పంపుతున్నారు. అయినా భూములు, సర్వే సమస్యలు అలాగే ఉన్నాయి. దీంతో కలెక్టర్‌కు చెప్పుకుంటేనైనా ఈ సమస్యలు పరిష్కారమవుతాయిని భావిస్తున్న అర్జీదారులు కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇలా వందలాది మంది సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు అర్జీల స్వీకరణ జరిగింది.

● కలెక్టరేట్ కిటకిట

కలెక్టరేట్‌కు తండోప తండాలుగా అర్జీదారులు వారి కుటుంబ సభ్యులు, మరోవైపు ధర్నాలకు జనం రావడంతో కలెక్టరేట్ కిటకిట లాడింది. మధ్యాహ్నం 3 గంటల వరకు జనం పడిగాపుల కాసి 244 మంది అర్జీలు సమర్పించారు. ఈ అర్జీలలో రెవెన్యూ శాఖకు సంబంధించి అర్జీలే ఎక్కువగా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు 120 అర్జీలు, మున్సిపల్ శాఖకు 16, సర్వేశాఖకు 16, పీఆర్‌కు 19, సివిల్ సప్లయిస్‌కు 12 అర్జీలు ఉన్నాయి.

● సోమశిల, కండలేరు, నెల్లూరు, సంగం బ్యారేజీల వద్ద నీటి విడుదల గేట్ల నిర్వహణకు ఆపరేటర్లను నియమించాలని కోరుతూ బీజేపీ నేత మిడతల రమేష్ వినతిపత్రం సమర్పించారు.

● పెన్నానది మీద నిర్మాణం చేస్తున్న నూతన బ్రిడ్జీల వలన గృహాలు కోల్పోయిన వారికి జాతీయ రహదారి సంస్థ నుంచి నష్టపరిహారం అందచేయాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియాఉల్‌హక్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

మండలస్థాయి అర్జీలను అక్కడే పరిష్కరించాలి : కలెక్టర్

స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి పరిష్కరించాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, అర్జీదారులు జిల్లా కేంద్రం వరకు రాకుండాసమస్యలు పరిష్కారించాలన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ తెలిపారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 72 మంది బాధితులు తమ సమస్యలను పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై త్వరిత గతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

● రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నవాబుపేటకు చెందిన వ్యక్తికి బాలాజీనగర్‌కు చెందిన చందు రఘువర్ధన్ కిడ్నీ ఇప్పిస్తానని నమ్మించి రూ.50 లక్షలు తీసుకున్నాడని, కిడ్నీ ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని బాధితులు ఫిర్యాదు చేశారు.

● కడపకు చెందిన బాలసాయి, నగరానికి చెందిన మరో వ్యక్తి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని బీవీ నగర్‌కు చెందిన కృష్ణచైతన్య, ప్రవీణ్‌లు రూ.40 లక్షలు తీసుకొన్నారని, ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేస్తున్నారని బాధితులు తెలిపారు. నగదు తరిగి ఇవ్వమంటే వేధిస్తున్నారని ఆవేదన చెందారు

● వేదాయపాలెం పరిధికి చెందిన అమీన్ అనే వ్యక్తి వెంగళరావునగర్‌కు చెందిన వ్యక్తికి గేట్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ2.40 లక్షల తీసుకొని మోసం చేశాడని విచారించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



రెండేళ్లుగా తిరుగుతున్నా పాసుపుస్తకం ఇవ్వడంలా..!

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం ● అడ్డుకుని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లిన పోలీసులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మనుబోలు మండలం మడమనూరు గ్రామానికి చెందిన ఓ రైతు సోమవారం పురుగుమందు డబ్బాతో కలెక్టర్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు అతని ప్రయత్నాన్ని అడ్డుకుని కాపాడారు. అనంతరం కలెక్టర్ ఆనంద్ వద్దకు తీసుకెళ్లారు. అతని సమస్యను తెలుసుకున్న కలెక్టర్ తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివరాలు ఆలా ఉన్నాయి. మడమనూరుకు చెందిన మోడిబోయిన వెంకటరమణయ్యకు మండలంలోని బిరుదవోలు పంచాయతీలో 20 ఎకరాల 32 సెంట్లు పట్టాభూమి ఉంది. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకం, 1బీ అడంగల్ ఇవ్వాలని రెండేళ్లుగా మండల రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులు పట్టించుకోక పోవటంతో కుటుంబంలో కూడా కలతలు వచ్చాయి. దీనితో మనస్తాపం చెంది గత్యంతరం లేని స్థితిలో జీవితం మీద విరక్తితో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోడానికి కలెక్టరేట్‌కు వచ్చానని బాధితుడు తెలిపారు.

ఇనామ్ మిగుల భూముల ఆక్రమణలను అడ్డుకోండి

● నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

● కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెంలో ఉన్న ప్రభుత్వ ఇనామ్ మిగుల భూముల అక్రమణలను అడ్డుకోవాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంగళం పుల్లయ్య మాట్లాడుతూ పాపిరెడ్డిపాళెం రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 497, 498లలో 12.50 ఎకరాల ప్రభుత్వ ఇనామ్ మిగుల భూమి ఉందన్నారు. ఈ భూమి చుట్టూ ఉన్న నిరుపేదలు భూస్వాముల ఆక్రమణ నుంచి కాపాడుకుంటూ 18 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని చెప్పారు. గత ఏడాది అప్పటి వైసీపీ నాయకులు తప్పుడు రికార్డులు సృష్టించి ఆ భూమిని ఆక్రమించుకోడానికి ప్రయత్నించారన్నారు. నిరుపేదలు ఆ ప్రయత్నాన్ని ఎదురించి అక్రమణ నుంచి కాపాడారన్నారు. ఈ భూమిలో ఇంటి స్థలం లేని 450 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. ప్రస్తుతం ఆ భూమి తమదంటూ కొందరు పోలీసులు, రెవెన్యూ అధికారుల అండతో ఎక్స్‌కవేటర్‌తో ఆ గుడిసెలను అక్రమంగా కూల్చి వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ వాస్తవంగా ఆ భూమి ప్రభుత్వ రికార్డుల్లో 100 ఏళ్లుగా ఇనామం భూమిగా ఉందన్నారు. ఇలాంటి స్థితిలో ఆక్రమణదారుడికి ఆ భూమి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దబ్బయ్య మండల కార్యదర్శి పచ్చ మధు, బండి శౌరి, మారుబోయిన రాజా, ఉంద్రాళ్ల శీనయ్య, మోచర్ల రాధయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, నెల్లూరు జీజీహెచ్‌లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక జనరల్ ఫిజీషియన్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వైద్యుడికి ప్రభుత్వం నెలకు రూ.1.10 లక్షల వేతనం లభిస్తుందన్నారు. సంబంధిత వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవడం తోపాటు అన్ని ధ్రువీకరణ పత్రాలతో బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూ కు హాజరు కావాలని పేర్కొన్నారు. అలాగే ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి లో డెంటల్ టెక్నీషియన్ 1, జీజీహెచ్‌లోని డైస్ కేంద్రానికి అడియాల జి కమ్ స్పీచ్ థెరపీ 1, ఖాళీలు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. వీరికి ఈనెల 19వ తేదీన డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల ని ఆయన పేర్కొన్నారు.



ఐటీడీఏ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

'గురుకుల'ంలో గురువులేరీ!?

గురుకుల పాఠశాలల్లో నెల రోజులుగా ఉపాధ్యాయులు లేక తరగతుల జరడం లేదని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఐటీడీఏ కార్యలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. టెన్త్ పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా అధికారులు వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. తొలుత నగరంలోని కొండాయపాళెం గేటు నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు.


- నెల్లూరు (హరనాథపురం,ఆంధ్రజ్యోతి)

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డీబార్

వెంకటాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సోమవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పరీక్షలకు 4574 మందికిగానూ 4213 మంది హాజ రుకాగా, 361 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ముగ్గురు డీబార్ అయినట్లు ఆమె పేర్కొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో విజయభాస్కర్ పోస్టర్ ఆవిష్కరించారు. అలాగే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఇంధన పొదుపు భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమన్నారు. దీనిపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. గ్రామస్థాయికి ఇంధన పొదుపుపై అవగాహన వెళ్లాలని, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, రమేష్ చౌదరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేటి నుంచి శిక్షణ

ఉదయగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం నుంచి రెండు రోజులు సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మౌలిక వసతులు కల్పించేందుకు తొమ్మిది అంశాలపై శిక్షణ నిర్వహించనున్న ట్లు ఆయన తెలిపారు. శిక్షణకుశాఖల ఉద్యోగులు, సర్పంచు లు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనంతసాగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రాళ్లపాడు ప్రాజెక్టు బ్రిడ్జి రోడ్డు

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు బ్రిడ్జి రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉన్నది. 2013లో జైకా నిధులు రూ.20 లక్షలతో మంజూరు అయితే అధికారులు గుంతలు పూడ్చిచ ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. వేసిన కొన్నిరోజులకే రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు సందర్శనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు సందర్శిస్తుంటారు. అలాగే ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు రోడ్డు కనెక్టివిటీగా ఉంది. ప్రతి నిత్యం ఈ రోడ్డుపై లింగసముద్రం నుండి కావలి, కలిగిరి మీదుగా నెల్లూరు, కందుకూరు, ఒంగోలు పట్టణాలకు బస్సులు తిరుగుతుంటాయి. ముఖ్యంగా శని, ఆదివారాల్లో రోడ్డు మీదుగా మాకొండ, దత్తాత్రేయస్వామి ఆలయాలకు వాహనాల్లో భక్తులు వస్తుంటారు.



బంగ్లావీధి సిమెంట్ రోడ్డులో కాలువలా తీసిన గుంట

రోడ్డు నిర్మాణానికి
అడ్డుగా తాత్కాలిక పాక

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరేడు ఎస్సీకాలనీలో రావినూతల మాధవ ఇంటి నుంచి ఎస్సీల శ్మశానం వరకు 100మీటర్లు రూ.6 లక్షలతో నిర్మాణం చేపట్టారు. మిగిలిన భాగం నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ తీర్మానం చేసి సిమెంట్ రోడ్డు మంజూరు చేయించారు. అదే కాలనీకి చెందిన కత్తి ఆదిలక్ష్మీ కుటుంబం ప్రస్తుతం నిర్మాణం చేపట్టాల్సిన రోడ్డుకు అడ్డంగా పాలిథన్ కవర్‌తో తాత్కాలిక పాక వేసు కుని స్థలాన్ని వాడుకుంటున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని వేసిన పాకను తొలగించాలని కాలనీవాసులు సూచించినా ఖాతరు చేయడం లేదు. ఈ విషయంపై కార్యదర్శి భాస్కర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థాని కులు వాపోతున్నారు. స్థానిక అధికార పార్టీ నా యకుల్లో ఒకవర్గం సదరు వ్యక్తికి మద్దతు ఉండ టం వలనే పాకను తొలగించడం లేదని ఎస్సీ కానీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ కాలనీకి మం జూరైన రోడ్డును గ్రామంలోని రెడ్డి సామాజికవర్గం ప్రాంతానికి మార్చినట్లు పంచాయతీ రాజ్ ఏఈ మూర్తి తెలిపారు.



సిమెంట్ రోడ్డులో నిర్మించిన తాత్కాలిక పాక

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మాజీ ఎమ్మెల్యే కంభం

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలో ఫెంగల్ తుపాన్ ప్రభావంతో శనగ పంట సాగుచేసి దెబ్బతిన్న రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మొలక దశలో ఉన్న పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీంతో ప్రభుత్వం పంట దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ లో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు అం దించనున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుంద న్నారు. కార్యక్రమంలో ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి ఎస్ వెంకట సుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంభం

తనఖాలు లేకుండా రైతులకు రుణాల మంజూరు

● కెనరా బ్యాంకు ఆర్ఎం ఆడారి నాగరాజు

అల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తనఖాలకు లేకుండా తమ బ్యాంకు రైతులకు రుణాలు అందజేస్తుందని కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు ఆడారి నాగరాజు తెలిపారు. ఇస్కపల్లి కెనరాబ్యాంకుశాఖ 50ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన సభలో ఆయనతో పాటు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, పైడేరు ఎస్కేప్-2 అధ్యక్షుడు బీద గిరిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. కెనరా బ్యాంకు వ్యవస్థాపకులు అమ్మెంబాల్ సుబ్బారావు నాటిన బీజం నేడు మహా వృక్షంగా ఎదిగి కోట్ల మందికి ఆదెవురుగా మారిందని చెప్పారు. ఎంతోమంది ఖాతాదారులు, రుణ లబ్ధిదారులు, ఉద్యోగులు రుణాలు పొంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. మత్స్యకారులకు బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని గిరిధర్ కోరారు. కార్యక్రమంలో మేనేజరు రాంజీ గౌతమ్, ప్రధాన ఖాతాదారులు పుచ్చలపల్లి సూర్యప్రకాష్, పోలయ్య, సిబ్బంది నజీర్ బాషా పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు

గ్రామాల అభివృద్ధే
లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒక్కొక్క గ్రామ పంచాయతీకి వివిధ రూపాలలో ఏడాదికి రూ.రెండు నుంచి రూ.3కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో సంపద సృష్టించి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ హేమంత్ భరత్‌కుమార్, ఎంఈఓ-2 మల్లికార్జునరావు, సీహెచ్ఓ శివరామయ్య, సర్పంచ్‌లు సాధు శ్రీలత, సతీష్, చెన్నిబోయిన ఓబులుకొడయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కందిపప్పు ఇవ్వడం లేదని ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 16: పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధికి చెందిన పలువురు తమకు గత మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని సోమవారం తహసీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చౌక దుకాణం ద్వారా ప్రభుత్వం కిలో కందిపప్పు రూ.67కు అందజేస్తుండడంతో అందరం తీసుకునేవారమని, మూడు నెలలుగా ఇవ్వడం లేదని, పంపణీ చేసేవారిని అడిగితే లేదని సమాధానం చెబుతున్నారన్నారు. ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. వీఆర్వోలతో చర్చించి పంపిణీ చేసేలా చూస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

బాలికల గురుకుల పాఠశాలలో వసతులు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

● కలెక్టరుకు సీమాంధ్ర బీసీ సంక్షేమ నేతల వినతి

అల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నార్తుఆములూరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గదులతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సోమవారం కలెక్టరుకు విన్న వించినట్లు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నేతలు బాబురెడ్డి, శ్రీనివాసులు, దయాకర్‌యాదవ్ తెలిపారు. ఈ విషయంపై సోమవారం మండలకేంద్రంలో మాట్లాడారు. 200మంది బాలికలకు నిద్రపోయేందుకు సౌకర్యం లేదని వాపోయారు. వీరి కోసం ఉన్న పాఠశాల భవనంపైనే ఐదు అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని లేదా కొంతమంది బాలికలను వెంకటాచలం, గొలగమూడి, విద్యానగర్ పాఠశాలలకు తాత్కాలింగా తరలించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మురళి, జయరామరాజు, సందానిబాషా, మురళి, జి.శివకుమార్, పి.సుబ్రహ్మణ్యం, పి.వాసు పాల్గొన్నారు.

అయ్యప్పకు గ్రామోత్సవం




గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి

అల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పండుగ నెలారంభాన్ని పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ భూముల అన్యాక్రాంతం

వలేటివారిపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ అధికా రుల నిర్లక్ష్యం, రెవెన్యూ అధికారుల అలసత్వంతో వలేటివారిపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన మాన్యం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కొందరు ఆక్రమ ణదారులు ఈ భూములను ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. మరికొందరు రెవెన్యూ అధికారుల చే యి తడిపి ఆన్‌లైన్ పేర్లు ఎక్కించుకుని పాసుబు క్కులు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న ట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయానికి సం బంధించిన మాన్యం భూములు ఏ గ్రామాల్లో ఎక్కడెక్కడ ఉన్నాయో దేవాదాయశాఖ అధికారులకే తెలియ దంటే వారి పనితీరు బట్టి అర్థం అవుతుంది. ఆలయ భూ ము లు రికా ర్డులలో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. అధికారుల లెక్కల ప్రకారం 260.62 మాన్యం భూములు న్నాయి అయితే మండలంలోని జమీన్‌ఉప్ప లపాడులో 70 ఎకరాలు, పోలినేనిపాలెంలో 14ఎకరాలకు మాత్రమే ఆలయ అధికారులు మూడేళ్లకోసారి కౌలు వేలం నిర్వహిస్తున్నారు. మిగిలిన 170 ఎకరాలు ఎక్కెడెక్కడ ఉన్నాయో తెలియదు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి సర్వేచేసి అన్యాక్రాంతమైన మాన్యం భములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అనంతరం భూములకు కౌలు వేలం నిర్వహించి వచ్చిన ఆదాయంతో అభివద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.



వలేటివారిపాలెం రామలిం గేశ్వరస్వామి ఆలయం

ఉత్సాహంగా నెహ్రూ యువకేంద్ర క్రీడా పోటీలు

కావలిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జెడ్పీ క్రీడా మైదానంలో జరిగిన డివిజన్‌స్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆ స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో జరిగిన పోటీలకు ముఖ్య అతిథులుగా జిల్లా యువజన అధికారి మహేంద్ర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ఎంఈవో గోవిందయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేంద్రరెడ్డి మాట్లాడారు. ఆరోగ్యం, ఆనందం ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. పురుషులకు వాలీబాల్, పరుగు పందెం, షాట్‌పుట్ అంశాలలో పోటీలు, మహిళలకు ఖోఖో, పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో అంశాల్లో పోటీలు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో విజేతలు 21 తేదీ నెల్లూరులో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హులని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి అలీమ్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిరంజీవి, మణికంఠ, రాజ్యలక్ష్మి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బ్రహ్మయ్య, వినయ్, ఖాదర్‌బి, ప్రసాదరావు, వినయ్ పాల్గొన్నారు.



విజేతలను సర్టిఫికెట్లతో అభినందిస్తున్న మహేంద్ర రెడ్డి

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ఆత్మకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపా యాలైన తాగునీటి వసతి కల్పించి, పారిశుధ్యం మెరు గుపరిచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలని తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా మండలంలో 82 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, ప్రతి గ్రామం బహిరంగ మలవిసర్జితరహిత గ్రామంగా రూపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ షేక్ ఖాదర్‌మస్తాన్, ఈవోపీఆర్డీ డేవిడ్, ఎంఆర్‌పీసీ దాసరి బ్రహ్మయ్య, పలువురు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఇంధన పొదుపు వారోత్సవాల బ్యానర్ ఆవిష్కరణ



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు

కావలి, డిసెంబరు 16: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల బ్యానర్‌ను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా సోమవారం కావలిలో విద్యుత్‌శాఖ అధికారులు ఆవిష్కరించారు. విద్యుత్‌పొదుపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20వరకు జాతీయ పొదుపు వారోత్సవాలను చేపడు తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రజలలోకి వెళ్లి విద్యుత్ పొదుపు చేసుకునేందుకు వియోగించే పరికరాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసినట్లని తెలిపారు. విద్యుత్‌పొదుపుపై ప్రజలలో మరింత చైతన్యం తెచ్చేందుకే వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ, కావలి, కలిగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు రవికుమార్‌రెడ్డి, క్రిష్ణ మోహన్, కావలి టౌన్, రూరల్ ఏఈలు వసంతరావు, శ్రీనివాసులు రెడ్డి సబ్‌డివిజన్‌లోని పలువురు ఏఈలు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ

కందుకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా పట్టణంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డివిజన్‌లోని విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతను వివరిస్తూ బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు ముదుకు సాగారు. ప్రధాన కూడళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు.

తూర్పుఎర్రబల్లిలో
రెవెన్యూ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు కోటేశ్వరరావు

కొండాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుఎర్రబల్లిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 8 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఉదయగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న దుర్వేష్ ఔలియా వారి గంధ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గంధాన్ని దర్గా నుంచి బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించి తిరిగి దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ ఎస్టీ కాలనీ వాసులకు సోమవారం తహసీల్దారు వై నాగరాజు తన సొంత నిధులతో దుప్పట్లు పంపిణీ చేశారు. కాలనీలోని 40 కుటుంబాలకు రెండేసి దుప్పట్ల చొప్పున పంపిణీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయరూ..

● అన్నదాతల మొర

ఉదయగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుడినరవ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సాగులో ఉన్న వరి పంట ఎండిపోతోందని సోమవారం రైతులు వాపోయారు. రెండు నెలల క్రితం గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందన్నారు. దాని పరిధిలోని రైతులకు సంబంధించిన 7.50 ఎకరాల పొలంలో వరి సాగు చేయగా ప్రస్తుతం పొట్ట దశలో ఉందని, నీడి తడులు అందించక పోవడంతో నెర్రెలుబారి పంట ఎండు తోందన్నారు. వేల రూపాయలు పెట్టుబడులు సాగుచేసిన వరి పంట కళ్లెదుటే ఎండిపోతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి ఎండుతున్న వరి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

నేడు ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, టీవీఎస్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. కావున ఎస్ఎస్‌సీ నుంచి ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బిటెక్, ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు జెరాక్స్ బయోడేటా తీసుకురావాలని తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఉదయగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం వద్ద ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర, సహస్రబిల్వదళార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోరంబోకు భూములు అప్పగించాలని వినతి

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొడుగోదను మేపుకునేందుకు పోరంబోకు భూములు గ్రామస్థులకు అప్పగించాలని నకిలీ పత్రాలతో దోచుకునే వారికి ఎలా ఇస్తారని స్థానికులు సోమవారం పోలీసులను ప్రశ్నించారు. బోగోలు మండలం అక్కరాజువారి కండ్రిక గ్రామ శివారులోని భూములను కొనుగోలు చేశామని కొందరు సోమవారం భూములు దున్నుతుండగా చెంచులక్ష్మీపురం, అక్కరాజువారి కండ్రికకు చెందిన గ్రామస్థులు వచ్చి మరోసారి అడ్డుకున్నారు. ఇదివరకు కూడా ఇదే విధంగా దున్నకాలను అడ్డుకున్నట్లు వారు చెప్పారు. అటవీ, మేతపోరంబోకు భూములు ఇవ్వాలని స్థానికులు తహసీల్దారు సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి ప్రయోజనం లేక ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. పోలీసులు ఇరువురికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బిట్రగుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ అరవపాలెంలో సోమవారం టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరావు, బోగోలు ఇన్‌చార్జి ఎం.వెంకయ్యలు సీసీ రోడ్డు పనులకు పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నాగరాజు, బి.ప్రభాకర్, అర్జున్‌రాజ్, ఎంపీటీసీ స్వరూపరాణి, వార్డు సభ్యులు ఎం.కిరన్‌కుమార్, మురళీ ఉన్నారు.

కావలి ఎమ్మెల్యేను కలిసిన మంత్రి ఆనం

కావలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సోమవారం సాయంత్రం కావలికి వచ్చారు. అమరావతి నుంచి నెల్లూరు వెళుతూ ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆహ్వానం మేరకు ముసునూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అక్కడ అల్పాహార విందు చేశారు. స్థానిక రాజకీయాలు, అభివృద్ధిపై మంత్రితో ఎమ్మెల్యే ముచ్చటించారు.



మంత్రి ఆనంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కెఫా అవార్డ్స్‌కు కలిగిరి యువకుడి ఎంపిక

కలిగిరి,వింజమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో కరనమ్స్ ఎంట ర్టైన్‌మెంట్ ఫిల్మ్ అవార్డ్స్ (కఫా)-2024లో ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్ డైలాగ్ రైటింగ్ కేటగిరిలో మండ లానికి చెందిన ఎరుకల రెడ్డిపాలెం యువకుడు కోట అనిల్‌కుమార్ రెడ్డి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని ఏపీఎన్ జీజీఓస్ వింజమూరు తా లూకా అధ్యక్షుడు వెలుగోటి మధు తెలిపారు. ఈ సందర్భంగా అ నిల్‌కుమార్‌ను స్వగ్రామంలో సోమవారం సత్కరించారు. భవిష్య త్‌లో ఉత్తమ డైరెక్టర్‌గా రాణించాలని ఆకాంక్షించారు. గ్రామస్థు లు ఆయనకు అభినందనలు తెలిపారు.



అభినందిస్తున్న వెలుగోటి మధు

నేడు పెన్షనర్ల సంఘ సమావేశం

కావలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంఘ తాలూకా సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రమణయ్య, ఆదిశేషులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్డీవో వంశీక్రిష్ణ, డీఎస్పీ శ్రీధర్, అసిస్టెంట్ ఉప ఖజానా అధికారి రాయపాటి జగజ్జీవన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయండి

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీల్లో నాడు-నేడు పథకం కింద రెండోవిడతలో రూ.7.10 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే పనులు నిలిపివేశారు. పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం వీటి చూట్టూ చిల్లచెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపో వడంతో వంటగదిలో చిన్నారులు, బాలింతలు కాలం వెల్లదీస్తున్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసులు

మర్రిపాడు,16 (ఆంధ్రజ్యోతి):నెల్లూ రు-ముంబయి జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



? ప్రమాదాల నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు.

! జంక్షన్ల వద్ద వాహనాల వేగం అదుపునకు జిగ్‌జాగ్ రూపంలో డ్రమ్ములు చేశాము.

? అవులు, గేదెలు రోడ్డు మీదకు రాకుండా కట్టడి చేయగలరా.

! రహదారిపై ప్రమాదాలకు కారణమైన పశువు యజమానిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాము. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

? ఎక్కువగా ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి.

! భూ తగాదాలు అధికంగా వస్తున్నాయి. అట్టివారిని రెవెన్యూ సివిల్ కోర్టులకు వెళ్లమంటున్నాము.

వీఎస్‌యూలో పొట్టిశ్రీరాములు వర్ధంతి



విజేతలతో వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు తదితరులు

వెంకటాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, పీఆర్‌వో డాక్టర్ నీలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే సైబర్ నేరాలకు విరుగుడు

పొదలకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు విస్తరిస్తున్న సైబర్ నేరాలకు అప్రమత్తతే విరుగుడు అని ఎస్‌ఐ ఎస్‌కే ఎండీ హనీఫ్, బ్యాంక్ ఆఫ్ బరోడా బీఎం గంగినేని రాజేష్ తెలిపారు. సోమవారం స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, గుర్తింపు పొందిన సంస్థల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలన్నారు. ట్రీస్ కార్యదర్శి షేక్.అహ్మద్, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జీఎస్.రెడ్డి, అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జి కృష్ణ, రిసోర్స్ పర్సన్స్ టీ వెంకటేశ్వర్లు, ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాల్లో టీడీపీ జెండా ఎగరాలి



టీడీపీ జెండాతో అయ్యప్ప భక్తులు

పొదలకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జెండా కేవలం తెలుగురాష్ట్రాల్లోనే కాకుండా అన్నీ రాష్ట్రాల్లో ఎగరాలని తెలుగు తమ్ముళ్లు ఆకాంక్షించారు. మాలధారణంతో పట్టణం నుంచి మూడు రోజుల క్రితం శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు సోమవారం అక్కడికి (పంబ) చేరుకున్నారు. అనంతరం అక్కడ టీడీపీ జెండాతో కాలినడకన వెళ్లారు. వారు మాట్లాడుతూ టీడీపీ జెండా అన్నీ రాష్ట్రాల్లో ఎగరడమే తమ అభిలాష అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కలగట్ల సందీప్, అనిశెట్టి వీరేంద్ర, పీ అనీల్‌కుమార్, బాలచంద్ర, దినేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్‌కు సన్మానం



మడపర్తిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులగౌడ్‌ను జీజీహెచ్‌లో సోమవారం బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోసూరు బాలయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరకాల శివాగౌడ్ తదితరులు కో ఆర్డినేటర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి జీజీహెచ్‌కు వచ్చే రోగులకు పేద, ధనిక అన్న తారతమ్యం లేకుండా వైద్యం అందించేలా కృషి చేయాలన్నారు. జీజీహెచ్ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులగౌడ్ మాట్లాడుతూ వైద్యసేవలు అందించడంలో జీజీహెచ్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తామని తెలిపారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు : ఏడీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తోటపల్లిగూడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగుమందుల దుకాణదారులు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. మండ లంలోని నరుకూరులో సోమవారం మండల ఏవో శిరీషతో కలిసి ప్రైవేటు ఎరువుల దుకాణా లను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణదారులు రైతుల కోరిన వాటిని మాత్రమే ఇవ్వాలని, ఇతర పురుగు మందులు కొంటేనే యూరియా ఇస్తామని చెప్పడం నేరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన హెచ్చరించారు.

ఆధార్ కోసం నిరీక్షణ



ఆధార్ నమోదు కోసం వేచివున్న ప్రజలు

మనుబోలు, డిసెంబరు 16: ఆధార్‌కార్డులో సవరణలు, కొత్తకార్డుల నమోదు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే మండలానికి ఓ చోట మాత్రమే నమోదు కేంద్రం ఏర్పాటు చేసింది. దీంతో సోమవారం పలు గ్రామాల నుంచి పిల్లలు, పెద్దలు భారీగా మనుబోలు -2 సచివాలయానికి చేరుకున్నారు. చేతివేళ్ల అంతర్జాలంలో నమోదు కాకపోతే ఐరీష్ ద్వారా కళ్లను స్కాన్‌చేసి ఆధార్‌కార్డులు కొత్తవి నమోదు చేశారు.

దొంగల హల్‌చల్

- హరనాథపురంలోని అపార్ట్‌మెంట్‌లో ముసుగు దొంగలు
- సంతపేటలో పట్టపగలే ఇళ్లు కొల్లగొట్టారు



అపార్ట్‌మెంట్‌లో దొంగతనానికి వెళుతున్న ముసుగు దొంగలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నగరంలోని హరనాథపురం ఎక్‌టెన్షన్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో, పొర్లుకట్ట వద్ద ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడి భారీగా బంగారు నగలు దోచుకెళ్లారు. మొహం కన్పించకుండా ముసుగులు కప్పుకొని చెప్పులు లేకుండా అడుగులో అడుగులు వేసుకుంటూ వెళ్లి అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో దోపిడీ చేసిన ఘటనలో సీసీ ఫుటేజ్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండటంతో నగర ప్రజలు భయాందోళనకు గురవుతోన్నారు. ఇక పొర్లుకట్ట వద్ద పట్టపగలే చోరీ జరగడం ఆ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. నగరంలో మరో రెండు ప్రాంతాల్లోనూ చోరీలకు యత్నించినట్లు సమాచారం. అయితే వీటిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

● హరనాథపురంలో ముసుగు దొంగలు

నగరంలోని హరనాథపురంలోని ఎక్‌టెన్షన్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న పంకజ్‌కుమార్ కృష్ణాపట్నంలోని ఓ ఆయిల్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నారు. గత నెల 28వ తేది ఆయన కుటుంబ సభ్యులో కలసి నార్త్‌ఇండియా టూర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేది రాత్రి గుర్తుతెలియని ఇద్దరు దుండగలు మొహాలకు ముసుగులు వేసుకొని చెప్పులు లేకుండా అడుగులో అడుగులు వేసుకొంటూ చేతిలో రాడ్డు పట్టుకొని అపార్ట్‌మెంట్‌లోకి చొరబడ్డారు. పంకజ్‌కుమార్ ఫ్లాట్ తలుపులు పగులగొట్టి ఇంట్లోని బంగారు నగలు దోచుకెళ్లారు. 14వ తేది ఉదయం ఎదురింటి ఫ్లాట్‌వారు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి పంకజ్ కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన బాలాజీనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌స్పెక్టర్ కె సాంబశివరావు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును, అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి నెల్లూరుకు చేరుకున్న పంకజ్‌కుమార్ ఇంట్లో పరిశీలించి సోమవారం బాలాజీనగర్ పోలీసులకు సుమారు 250 గ్రాముల నగలు దోచుకెళ్లారని ఫిర్యాదు చేశారు. అపార్ట్‌మెంట్‌లోకి దొంగలు చొరబడుతున్న సీసీ ఫుటేజ్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

● పొర్లుకట్ట వద్ద పట్టపగలే...

సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పొర్లుకట్ట ప్రాంతంలో పి దామోదర్, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. దామోదర్ రియల్‌ఎస్టేట్, చిట్టీలు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15వ తేది దంపతులిద్దరు ఇంటికి తాళం వేసుకొని వేదాయపాలెంలో నివాసం ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి అల్లీపురంలోని బంధువుల ఇంటికి వెళ్లి అర్ధరాత్రి దామోదర్ ఇంటికి చేరుకున్నాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా పట్టపగలే చోరీ జరిగిందని గుర్తించి సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి స్థానిక ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాస రావు, సిబ్బంది చేరుకుని పరిశీలించారు. బాధితుడు 32 సవర్ల నగలు దోచుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడిక తీస్తేనే రికార్డుల్లో నమోదు

బుచ్చి ఎంపీడీవో శ్రీహరి



బుచ్చిరెడ్డిపాలెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గడ్డికోయడంతో పాటు పూడికతీస్తేనే రికార్డుల్లో నమోదు చేయాలని బుచ్చి ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. కాలువల్లో తప్పని సరిగా పూడికతీయాలని ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశిస్తామని తెలిపారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

? : ఉపాధి పనుల్లో పూడిక తీయకనే రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.

! : గడ్డికోయడంతోపాటు పూడికతీస్తేనే రికార్డుల్లో నమోదు చేయాలి. తేడా వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

? : వరినాట్లు సమయంలో పూడికతీస్తే రైతులకు ఉపయోగకరం.

! : ఏప్రిల్ నుంచి మార్చిలోపు ఒక్కసారి మాత్రమే పూడిక తీత పనులు నిర్వహిస్తారు. మార్పులపై అవకాశం ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

? : రైతులు ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నప్పుడు అవసరమైతే నారుమళ్లు, వరినాట్లకు ముందు మరోసారి గడ్డికోసే పనులు చేపడతామన్నారు. ఏమైంది.

! : ఆగస్టులోపు పూడికతీత చేపట్టి ఉంటారు కాబట్టి మళ్లీ ఏడాదిలోపు రెండో సారి పూడికతీత చేపట్టేలా నిబంధనలులేవు.

ప్రభుత్వ స్థలాలు అమ్మేస్తున్నారని ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సురేష్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు బహిరంగంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఓ వ్యక్తి ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నగరానికి చెందిన చేజర్ల సురేష్ అనే వ్యక్తి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని జీవీఆర్ కళాశాల వద్ద కార్పొరేషన్‌కు చెందిన రిజర్వుడ్ స్థలాన్ని పౌరసరఫరాల శాఖ విశ్రాంత ఉద్యోగి ఆక్రమించి ఎన్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా భవంతిని నిర్మించాడని తెలిపారు. అలాగే చంద్రమౌళినగర్‌లో నకిలీ పట్టాలు సృష్టించి సదరు వ్యక్తి కొడుకు పేరట ఏకంగా 42 అంకణాల్లో రేకుల షెడ్డు నిర్మించి విక్రయానికి పెట్టారని తెలిపారు. ఇవి ప్రభుత్వానికి చెందిన స్థలాలని, విచారిస్తే రూ.కోట్ల ఆస్తి కాపాడవచ్చన్నారు. అనంతరం 33వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి హజరత్‌నాయుడు తన డివిజన్‌లోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి పత్రం అందచేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఖాళీ స్థలాల్లో పార్కులు నిర్మిస్తున్నామని, వాటి నిర్వహణకు స్థానిక కమిటీలు, వ్యాపార సంస్థలు ముందుకు రావచ్చని పిలుపునిచ్చారు. అంతకు ముందు 2వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన రోడ్లపై చెత్త వెయ్యనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'ఆపరేషన్ స్వేచ్ఛ' పక్షోత్సవాల ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వాణి

నెల్లూరు(లీగల్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా చేపట్టిన అపరేషన్ స్వేచ్ఛ పక్షోత్సవాలను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి సోమవారి జిల్లా కోర్టు ప్రాంగణంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ కర్మాగారాల్లో, వివిధ ప్రదేశాలలో బాల కార్మికులుగా జీవనం సాగిస్తున్న చిన్నారులను గుర్తించి వారికి విద్యాబుద్ధులు చెప్పించి వారి బాల్యాన్ని రక్షించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు అదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం ప్రకారం 14 ఏళ్ల నిండని బాలలతో కర్మాగారాల్లో, ఇతర ఏ సంస్థలలో పనులు చేయించకూడదన్నారు. ఈ కార్య క్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అఫీసర్ బి.సురేష్, అసిస్టెంట్ కమిషనర్ అఫ్ లేబర్ షేక్ గౌస్, డీఎస్పీ సీహెచ్.రామారావు, సీఐ సీహెచ్ ప్రసాద్, ఎన్‌జీవో ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వర్సిటీ పోటీలకు బీఈడీ విద్యార్థులు



చిన్నబాబు



ప్రదీప్

నెల్లూరు(విద్య), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): త్రివేండ్రంలోని కేరళ విశ్వవిద్యాలయంలో ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న జాతీయ విశ్వవిద్యాలయాల వాలీబాల పోటీలకు నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు పి.చిన్నబాబు, పి.ప్రదీప్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు జాతీయ క్రీడలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. వీరు వీఎస్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, జాతీయ పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

యోగా పోటీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న వీపీఆర్ దంపతులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో వీపీఆర్ స్కూల్ విద్యార్థిని శివ గాయత్రి అద్భుత ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. యోగా శిక్షణకుల విభాగంలో వీపీఆర్ స్కూల్ యోగా కోచ్ ప్రసన్నకుమార్ సైతం ద్వితీయ స్థానం కైవసం చేసుకుని సిల్వర్ మెడల్ సాధించారు. వారిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం వారి నివాసంలో అభినందించారు.

టిడ్కో ఇళ్లలో చేరండి : జనసేన

నెల్లూరు(క్రైం), డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి): టిడ్కో ఇళ్లను కేటాయించిన ల బ్ధిదారులందరూ ఇళ్లల్లో చేరితే సమ స్యలు సులువుగా పరిష్కారం అవుతాయ ని జనసేన పార్టీ నేత గునుకుల కిషోర్ తెలిపారు. అక్కచెరువుపాడు ప్రాంతంలో ఉన్న టిడ్కో ఇళ్లను సోమవారం జనసేన పార్టీ నాయకులు సందర్శించారు. లబ్ధిదా రుల సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ టి డ్కో ఇళ్లలో తాగునీరు, కరెంటు, ఆకతాయిల ఆగడాలు, మరే సమస్య అయినా బాధితులు మాకు ఒక్క ఫోన్ చేస్తే తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌లు టిడ్కో ఇళ్లను అందమైన టౌన్షిప్‌గా తయారు చేయబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారంపూడి కృష్ణారెడ్డి, సుందరరామిరె డ్డి, ప్రశాంత్‌గౌడ్, కరీం, పవన్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, మిద్దె తోటలపై అవగాహన

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని అపోలో ఆసుపత్రి సమీపంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యాల యంలో సోమవారం ఎస్‌పీకే విధానంపై సేవ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. వ్యవ సాయ భూమిలో 5 పొరల వ్యవసాయ పద్ధతి, మిద్దె తోటలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అ దేవిధంగా మొక్కలు, పశువుల నుంచి ఎరువులను త యారు చేసుకోవడంపై వివరించారు. ఈకార్యక్రమం లో ఎస్‌పీకే ప్రచారకులు విజయ్‌రామ్, రైతులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణాల మంజూరు

● మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు ప్రణాళికా బద్ధంగా రుణాలు మంజూరు చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు మెరుగైన జీవనోపాదులు కల్పించేందుకు జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో 200 దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూవబుల్ కంటెయినర్‌లలో 4 షాపుల నిర్మాణం ఉందన్నారు. నగరపాలక సంస్థ, మెప్మా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : ఖాదర్‌వలి



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి హెచ్చరించారు. సోమవారం నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నంతో కలిసి శ్రీదుర్గా ఆసుపత్రి స్కానింగ్ సెంటర్, అపోలో ఆసుపత్రి, నారాయణ ఆసుపత్రి, మెడికవర్ ఆసుపత్రుల స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశా రు. అక్కడ రికార్డులను, ఫామ్ ఎఫ్‌లను పరిశీ లించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనల ప్రకారం నడు చుకోవాలన్నారు. స్కానింగ్ పరీక్షలు నిర్వహించిన గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో క్షయ విభాగం జిల్లా కో ఆర్డినేటర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలిన స్తంభాల మార్పు

పొదలకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపై ప్రమాదకరంగా వాలిన విద్యుత్ స్తంభాలను సోమవారం అధికారులు మార్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. స్థానిక టీడీపీ యువనాయకులు ఈ సమస్యను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. దీంతో శ్రీహరికాలనీలో ఇళ్లపై వాలి ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు మార్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్.ఖాదర్‌బాషా, షేక్.మస్తాన్, షేక్.బాబులు, షేక్.దొరబాబు, రఫీ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు16:(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలియమ్స్‌పేటలో ఉన్న నగర పంచాయతీ డంపింగ్ యార్డు వల్ల తాము వ్యాధుల బారిన పడుతున్నామని, వెంటనే యార్డును తొలగించాలని ఎన్టీఆర్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. కాగా ఈ సమస్యను నగర కమిషనర్‌కు తెలియజేసినట్లు తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు వివరించారు. కాగా జొన్నవాడలో రీసర్వే సమయంలో 31వ సర్వేనెంబరులో ఉండాల్సిన తమ భూమిని 32సర్వేనెంబరులో ఎక్కించారని, దాన్ని మార్పుచేయాలని బాధితులు ఫిర్యాదు చేసినట్టు తహసీల్దారు తెలిపారు.

వేగూరులో పశు వైద్య శిబిరం

కోవూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగూరు పశువైద్యశాలలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్థకశాఖ డీడీ డాక్టర్ ఎన్ నాగమణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెయ్యదూడల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలో 20 వేల పశువుల్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు ఈ శిబిరంలో డీడీ డాక్టర్ సోమయ్య, పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ కృష్ణమౌర్య డాక్టర్ వసంతరాయులు, డాక్టర్ నాగేంద్ర, సర్పంచు అమరావతి, టీడీపీ నాయకులు సుబ్బానాయుడు, కరేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డిస్ట్రిబూటరీ కమిటీ చైర్మన్ ఎన్నిక

కోవూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) :సదరన్ చానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక మంగళవారం నిర్వహించనున్నట్లు నీటిపారుదల శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 9గంటలకు ఎన్నిక జరుగుతుందన్నారు. కోవూరు, బుచ్చి, కొడవలూరు, విడవలూరు మండలాల పరిధిలోని ఇటీవల ఎంపికయిన సాగునీటి సంఘాల అధ్యక్షులంతా కలసి వారిని ఎన్నుకుంటారని వివరించారు. ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మనుబోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పేదలకు సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. శ్రీసేవానాదం ట్రస్టు ఆరవ వార్షికోత్సవం, ట్రస్టు వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వీటి పంపిణీని చేపట్టినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులతోపాటు అన్నీ రాజకీయపార్టీల నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైసీపీ నేత అత్యాచారయత్నం

సైదాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఓ గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళపై వైసీపీ నేత అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధితురాలి కథనం మేరకు, గ్రామంలోని వైసీపీ నాయకుడు తోట శంకర్‌రెడ్డి మద్యం మత్తులో అత్యాచార యత్నానికి పాల్పడినట్లు సోమవారం బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కాంతికుమార్ తెలిపారు.

నేడు నటి సూర్యకాంతం శతజయంతి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేనేత సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు టౌనుహాలు వర్ధమాన సమాజంలో సినీనటి సూర్యకాంతం శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వై.శేషగిరీశం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎంపీ నారాయణమూర్తి, విశిష్ట అతిథిగా సినీ విజ్ఞాన విశారద ఎస్వీ.రామారావు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకులపేటలోని జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కార్యాలయం నూతన భవనంలో సోమవారం సుదర్శన హోమం ఘనంగా జరిగింది. అనంతరం శ్రీయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసరెడ్డి, వివిధ ఆలయాల ఈవోలు, ఇన్‌స్పెక్టర్ కృష్ణచైతన్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి మొదలుకుని శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి దాకా సొంతిళ్లులేని పట్టణ పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో చేపట్టిన గృహ నిర్మాణ పథకాలు అత్యంత దారుణ పరిస్థితుల్లో ఉన్నాయి. వేలాది ఇళ్లు అసంపూర్తిగా భూతాల నిలయాలను తలపిస్తుండగా, పూర్తయిన ఇళ్లలో కుటుంబాలు కనీస వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. సొంతిళ్లు దక్కాయని వాటిల్లో చేరిన లబ్ధిదారుల సంబరం మూన్నాళ్ళ ముచ్చటే అయింది. ఇళ్లలో చేరిన వేల కుటుంబాలు మూన్నాళ్లకే వాటిని విడిచిపెట్టి తిరిగి అద్దె ఇళ్లను వెతుక్కుంటూ పట్టణాలకు తిరుగు ప్రయాణమయ్యాయి. ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలతో, అధ్వాన పారిశుధ్యం, తాగునీరు లేక పాముల బెడదతో పట్టణ పేదల గృహ సముదాయాలు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. 2014-19 నడుమ టీడీపీ ప్రభుత్వం పేదల పట్ల నిబద్ధతతో మున్సిపల్ పట్టణాలలో ఇళ్ల పథకాలు మంజూరు చేయగా తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లూ మౌళిక సదుపాయాల కల్పన పట్ల తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. దీంతో ఈ సముదాయాలన్నీ దాదాపు నిర్మానుష్యంగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో మళ్లీ లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా మున్సిపల్ పట్టణాలలో 'ఆంధ్రజ్యోతి నెట్ వర్క్' జరిపిన పరిశీలనలో టిడ్కో ఇళ్ల నిర్మాణ సముదాయాల తీరుతెన్నులిలా వెల్లడయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల దుస్థితి



పుత్తూరులో అర్ధంతరంగా ఆగిన 572 ఇళ్ల నిర్మాణం

వైసీపీ పాపం దక్కని ఆవాసం

- ఐదేళ్లపాటు టిడ్కో ఇళ్లను పట్టించుకోని గత ప్రభుత్వం
- చిన్నపాటి మరమ్మతులూ చేయక.. లబ్ధిదారులకు కేటాయించని వైనం
- 'కూటమి'పైనే అందరి ఆశలు

వెంకటగిరి

ఫినిషింగ్‌కు నోచుకోని 672 ఇళ్లు

వెంకటగిరి పట్టణం తిరుపతి రోడ్డులో గత టీడీపీ ప్రభుత్వం 1824 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో 1152 పూర్తవడంతో గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించింది. మిగిలిన 672 ఇళ్లను గాలికొదిలేసింది. ఈ ఇళ్ళలో ప్లంబింగ్ పనులు, టైల్స్ ఏర్పాటు, తలుపులు, కిటికీలు, గ్రిల్స్ వంటివి పెండింగులో ఉన్నాయి. ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తి చేయించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో ఇళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. భవన సముదాయాల పక్కన పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో ప్రస్తుతం నివాసమున్న కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. రోడ్లపైన, పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించే దిక్కు లేదు. తాగునీరు చాలడంలేదు. తెలుగుగంగ నీటిని అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ ఇళ్ల సముదాయంలోని వంద మంది పిల్లలు చదువు కోసం మూడు కిలోమీటర్ల దూరంలోని వెంకటగిరికి వెళుతున్నారు. కాలనీలోనే అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నాయుడుపేట

ఐదేళ్లుగా పూర్తికాని 15 శాతం పనులు

నాయుడుపేట పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వం 2064 ఇళ్లను మంజూరు చేసి.. 85 శాతం పనులు పూర్తి చేసింది. టైల్స్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. తాగునీటి సదుపాయం లేదు. ఈ 15 శాతం పనులను కూడా గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయించలేకపోయింది. దీంతో అధికారులు ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధులు వీటిని పూర్తి చేయించడంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.





ఇంటికి, మరుగుదొడ్డికి అమర్చని తలుపులు

వికృతమాల

1600 కుటుంబాలు వెనక్కి

తిరుపతి నగరంలో సొంతిళ్లలేని నిరుపేదలకు గత టీడీపీ ప్రభుత్వం ఏర్పేడు మండలం వికృతమాల వద్ద 1800 ఇళ్లు మంజూరు చేసింది. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద 2019 ఫిబ్రవరి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తయింది. అదేనెలలో అప్పటి మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించేలోగా.. ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాయి. 'నీలాద్రి నిలయం' పేరిట నిర్మించిన ఈ ఇళ్లను వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల పాటు లబ్ధిదారులకు అప్పగించలేదు. కొవిడ్ సమయంలో వీటిని క్వారంటైన్ కేంద్రంగా వినియోగించింది. 2022 మేలో లబ్ధిదారులు ఆందోళనకు దిగడంతో వారికి ఇళ్లను అప్పగించింది. తాగునీరు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో 1800 కుటుంబాలలో 1600 కుటుంబాలు తిరిగి తిరుపతికి వెళ్లాయి. ఇపుడు 200 కుటుంబాలే అరకొర వసతుల నడుమ ఉంటున్నాయి. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రెండున్నరేళ్ల పాటు లబ్ధిదారులే చందాలు వేసుకుని పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. తాగునీరు లేక క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు పెరిగి పాముల బెడద అధికంగా ఉంది. గతేడాది ఆరేళ్ల చిన్నారిని ఇంట్లోనే పాము కాటేసింది. పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు ప్రబలి.. విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి.





వికృతమాల ఇళ్ల సముదాయంలో రోడ్డు దుస్థితి, (ఇన్‌సెట్‌లో) తాగునీటి పైపులైను దుస్థితి

గూడూరు

చెల్లాచెదురైన లబ్ధిదారులు

గూడూరు పట్టణం గాంధీనగర్ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వం 5120 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. నిర్మాణం పూర్తయ్యే సరికి ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం 2022 జూన్‌లో 5120 ఇళ్లలో 3358 మందికి ఇళ్లను అప్పగించింది. అందులో 1200 మంది నివాసానికి వచ్చారు. కండలేరు నుంచి ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను మరమ్మతులకు గురవడంతో తాగునీటి కొరత ఏర్పడి సుమారు 400 కుటుంబాలు టిడ్కో ఇళ్లను విడిచిపెట్టి పట్టణంలోకి వెళ్లిపోయాయి. తర్వాత 800 కుటుంబాలే ఉన్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సొంత నగదుతో పైపులైనుకు మరమ్మతులు చేయించారు. దీంతో నివాసితుల సంఖ్య 800 నుంచి 1254కు పెరిగింది. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు బాగున్నా.. బ్లాకుల మధ్య పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. విష పురుగులు చేరుతున్నాయి. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లపోను మిగిలిన ఇళ్ల లబ్ధిదారులు తలోదిక్కున చెదిరిపోయారు. ఇప్పుడు ఎమ్మెల్యే చొరవతో అధికారులు వారి వివరాలు సేకరించి ఇళ్లను అప్పగించే పనిలో పడ్డారు.



టిడ్కో ఇళ్ల సముదాయంలో బ్లాకుల నడుమ పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

శ్రీకాళహస్తి

గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

శ్రీకాళహస్తి శివార్లలోని రాజీవ్‌నగర్ సమీపంలో 6015 ఇళ్ల భారీ సముదాయానికి 2017 డిసెంబరు 10న అప్పటి మున్సిపల్ మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. నిర్మాణం జరుగుతుండగా 2019లో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థను మార్చింది. పనులు ప్రారంభం కాని 1632 ఇళ్లను రద్దు చేసింది. 4064 ఇళ్లు మంజూరు చేయాలని అప్పటి అధికార పార్టీ నేతలు ఖరారు చేశారు. అయితే 816 ఇళ్లనే కట్టించగలిగారు. ఆ ఇళ్లలోనూ పెయింటింగ్, ఇంటీరియర్, ఉడ్ వర్క్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు పెండింగులో ఉన్నాయి. ఐదేళ్లయినా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. 25 శాతం పెండింగ్ ఉన్న పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదు.



టిడ్కో ఇళ్ల సముదాయంలో రోడ్ల దుస్థితి

పుత్తూరు

మరీ దారుణం

పుత్తూరు పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వం 1060 టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. 1008 మంది లబ్ధిదారులు తమ వాటా కింద నగదు చెల్లించారు. నిర్మాణం మొదలయ్యాక ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వంలో 432 ఇళ్లు పూర్తయినా ఫినిషింగ్ పనులు పెండింగులో ఉంచి లబ్ధిదారులకు కేటాయించలేదు. మిగిలిన 572 ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. ఐదేళ్లలో తలుపులు, కిటికీలు వంటివి కూడా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో మొత్తం ప్రాజెక్టే నిరుపయోగంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో లబ్ధిదారులు ఇకనైనా తమకు ఇళ్లు దక్కుతాయని ఆశిస్తున్నారు.



స్వల్ప పెండింగు పనులతో లబ్ధిదారులకు దక్కని ఇళ్లు

సూళ్లూరుపేట

లబ్ధిదారులకు దక్కని ఇళ్లు

సూళ్లూరుపేట పట్టణంలో 2018లో 1632 టిడ్కో ఇళ్ళను అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. జీ ప్లస్ త్రీ చొప్పున బ్లాకుకు 48 ఇళ్లతో 34 బ్లాకుల నిర్మాణం చేపట్టింది. 2019 డిసెంబరు నాటికి 1600 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. పెయింటింగ్ కూడా వేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు కూడా నిర్మించారు. విద్యుత్ స్తంభాలు నాటారు. వీటికి లైన్లు ఏర్పాటు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. ఈ కొద్దిపాటి పనులను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చేయలేకపోయింది. ఇప్పటికీ ఆ పనులు పెండింగులోనే ఉన్నాయి. పూర్తయిన ఇళ్లను ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించలేదు.



పింఛనుతో ఆసరా ఇవ్వండి



'అయ్యా.. మాది సూళ్లూరుపేట సమీపంలోని తనియాల గ్రామం. 11 నెలల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో పక్షవాతం సోకింది. మంచానికే పరిమితమయ్యాను. పక్కన వారి సహాయం లేకుండా ఏ పనీ చేసుకోలేను. పూట గడవడమే ఇబ్బందిగా ఉంది. పింఛను వస్తే కాస్త ఆసరాగా ఉంటుంది. సదరం సర్టిఫికెట్ కోసం అధికారులు ముప్పతిప్పలు పెడుతున్నారు. మీరైనా న్యాయం చేయండి' అంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మునిరాజా విజ్ఞప్తి చేశారు.

- మరిన్ని వినతులు, ఫిర్యాదులు.. 6లో

తిరుపతి-పాకాల మధ్య రెండవ మార్గం

- సర్వే పనులకు రైల్వేబోర్డు అనుమతి

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి-పాకాల రైల్వే స్టేషన్ల మధ్య పెండింగ్‌లో వున్న రెండవ రైలు మార్గం సర్వే పనులకు రైల్వే బోర్డు అనుమతించినట్టు సమాచారం. ఈ మార్గం మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్‌కు మారిన తరువాత రైళ్ళ సంఖ్య బాగా పెరిగింది. పెరిగిన రైళ్ళ కారణంగా తిరుపతి-పాకాల-ధర్మవరం మధ్య రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దీంతో ఈ మార్గంలో రెండవ రైలు మార్గం ఏర్పాటు చేయాలని తిరుపతికి వచ్చిన ఉన్నతస్థాయి అధికారులకు చాలా



కాలంగా ప్రజా ప్రతినిధులు వినతులు ఇస్తున్నారు.కొన్నేళ్ళుగా ప్రజాప్రతినిధుల పోరాటం ఫలించింది.రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రెండవ రైలు మార్గం ఏర్పాటుపై సర్వే చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.రైల్వే నిర్మాణాల విభాగం అధికారులు సర్వే పనులు ప్రారంభించారు.

రెవెన్యూ సదస్సులకు 596 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 596 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. మండల, గ్రామస్థాయి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం 29 గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు. సోమవారం వరకు జిల్లా వ్యాప్తంగా 6,316 అర్జీలు వచ్చాయని అందులో సోమవారం వచ్చిన 596లో భూఆక్రమణలపై 2, హౌస్ సైట్స్‌పై 111, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 44, రీసర్వేపై 31, జీఎస్‌డబ్ల్యూఎస్‌పై 12, ఇళ్ల స్థలాలు, ప్రాజెక్టులు భూసేకరణపై 20, ల్యాండ్ గ్రాబింగ్‌పై 1, ఆర్‌వోఆర్‌కు 221, ఇతర రెవెన్యూ విషయాలకు సంబంధించి 152 వచ్చినట్లు తె లిపారు. అర్జీలను కాలపరిమితి లోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భక్తుడి పట్ల దురుసు ప్రవర్తన

- కాణిపాక ఆలయ ఉద్యోగిపై మంత్రి లోకేశ్‌కు ఎక్స్‌లో ఫిర్యాదు
- విచారించి తొలగించిన ఈవో

ఐరాల (కాణిపాకం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కాణిపాక ఆలయంలో దారుణంగా దోపిడీ చేస్తున్నారు. 500రూపాయలతో సాధారణ ఆశీర్వాద టికెట్ తీసుకున్నాం. దానిపై ఇద్దరికి అనుమతి అని రాసి ఉంది. కానీ అక్కడి సిబ్బంది ఒకరినే లోపలికి పంపించారు. అడిగితే ఇక్కడ రూల్స్ అంతే. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అన్నాడు. భక్తులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని కిశోర్ గౌడ్ అనే భక్తుడు ఎక్స్(ఒకప్పటి ట్విట్టర్)లో ఈ నెల 14వ తేదీన ట్వీట్ చేశాడు. మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ కూడా చేశాడు. ఈ అంశంపై లోకేశ్ ఒకరోజు వ్యవధిలో అంటే ఆదివారం స్పందించారు. నిష్పక్షపాతంగా విచారించి చర్యలు తీసుకుంటామని ఎక్స్‌లో రీపోస్టు పెట్టారు. ఇదిలా ఉండగా భక్తుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన డైలీవేజెస్ ఉద్యోగి కుట్టిబాబును విధుల నుంచి నిలిపి వేస్తున్నామని ఈవో కిశోర్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనను 'ఆఫీస్ ఆఫ్ నారా లోకేశ్ ఎక్స్ అకౌంట్‌లో సోమవారం పోస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..కిశోర్ గౌడ్ అనే భక్తుడు ఆలయ టికెట్ కౌంటర్ వద్ద రూ.500 సాధారణ ఆశీర్వాద టికెట్టును కొనుగోలు చేశారు. ఈ టికెట్టుతో తమను దర్శనానికి అనుమతించాలని ఆలయ ఉద్యోగిని కోరారు. దీంతో ఒకరిని మాత్రమే స్వామి దర్శనానికి అనుమతిస్తానని కుట్టిబాబు దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహించిన సదరు భక్తుడు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.ఆయన వెంటనే దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాటాడి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈవో కిషోర్ ఈ విషయాన్ని క్షుణ్ణంగా ఆరా తీసి కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న కుట్టిబాబును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారించనున్నట్లు ఈవో కిషోర్ వివరించారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉద్యోగులు,సిబ్బందితో సోమవారం ఈవో సమావేశమయ్యారు.భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని,గౌరవంగా సంబోధించాలని సూచించారు. ఎక్కడ ఎవరు తప్పు చేసినా ఆలయ ప్రతిష్ఠ దెబ్బతింటుందని కాబట్టి ప్రతి ఒక్కరూ ఆలయం పట్ల బాధ్యతగా ఉండాలన్నారు.



ఏటీసీ దాకా క్యూలైన్

సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లలు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,160

తలనీలాలు సమర్పించినవారు : 22,724

చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే..!

● 'పడమటి గాలి' నాటకంలో ఆకట్టుకున్న రాంకోటి ప్రతిన

● మాయోడి పాత్రలో ఆకట్టుకున్న రిటైర్డు ఐఏఎస్ బలరామయ్య





తన చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే అని పిడికిట మట్టి సాక్షిగా రైతు రాంకోటు చేసిన శపథం.. 'పడమటి గాలి' నాటకంలో ఉద్వేగపూరితంగా కనిపించింది. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో పాటిబండ్ల ఆనందరావు రచించిన ఈ నాటకాన్ని సోమవారం సాయంత్రం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించారు. మాయోడి పాత్ర ద్వారా రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య అందరినీ ఆకట్టుకున్నారు. ధ్వంసమైపోతున్న గ్రామీణ జీవనాన్ని దృశ్యమానం చేసిందీ నాటకం. ఈ నాటకంలో దళారీ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య ఈ పాత్రను పోషించారు. మల్టీనేషనల్ కంపెనీ ఏర్పాటు కోసం అవసరమైన భూ సేకరణలో జరిగిన సంఘర్షణ ఈ నాటకానికి ఇతివృత్తం. 50 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఓ రైతుకున్న 4 ఎకరాల భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని గ్రామంలోని దళారీ ద్వారా ఎత్తుగడ వేస్తారు. కొడుకు ద్వారానూ పన్నాగం పన్నుతారు. కడకు రైతును తన కొడుకు చేతులారా కడతేర్చడానికి కుట్ర చేస్తారు. ఎన్ని కుయుక్తులు పన్నినా నమ్ముకున్న భూమిని అమ్ముకోని రైతు రాంకోటు ఆత్మస్థైర్యం ఈ నాటకానికి పరాకాష్టగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ.. 25 ఏళ్లకుపైగా 150 ప్రదర్శనలు నిర్వహించినట్టు తెలిపారు. వేగవంతమైన జీవన శైలిని దృష్టిలో ఉంచుకొని రెండు గంటల నిడివితో ఈ నాటకాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. తిరుపతిలో ఇప్పటికీ ఈ నాటకానికి ఇంత ఆదరణ ఉండటం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. నాటక ప్రదర్శనకు ముందు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు సాకం నాగరాజ, తమటం రామచంద్రారెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ తదితరులు మాట్లాడారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ప్రతి అర్జీనీ గడువులోపు పరిష్కరించండి

● కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌కు 150 వినతులు



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 150 అర్జీలు అందగా, అందులో భూ సమస్యలపైనే 94 ఉన్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మౌలిక వసతులు కల్పించండి



కల్యాణ వెంకటేశ్వరపురం గ్రామస్తులు

'పుత్తూరు మండలం నేసనూరు గ్రామ పంచాయతీ కల్యాణ వెంకటేశ్వరపురంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి.. పంట నష్టపరిహారం కూడా ఇప్పించండి. రైతులకు డీకేటీ పాసుపుస్తకాలు, నివాస భూముల కోసం పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయండి' అంటూ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయండి



పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్న విద్యార్థులు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ, ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేశామని, కళాశాల అధికారుల తప్పిదం వల్ల పారా మెడికల్ రిజిస్ట్రేషన్ కల్పించలేదని విద్యార్థులు దీప్తి, భూలక్ష్మి, చందు, పల్లవి, రమ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పారా మెడికల్ రిజిస్ట్రేషన్, ఉపాధి కల్పించాలని అభ్యర్థించారు.

ప్రత్యామ్నాయ స్థలం చూపండి

తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపాల సమీపంలో హథీరాంజీ మఠం స్థలంలో చేపలు విక్రయించి జీవనం సాగిస్తున్నామని, మున్సిపల్ అధికారులు అక్కడ వ్యాపారం చేయరాదని బెదిరిస్తున్నారని, ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏఐటీయూసీ నేతలు శ్రీనివాసులు, శివకుమార్, బాలాజీ, విజయ్, గురవయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేపల వ్యాపారులు

రెండు బార్లకు ఈ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో రెండుబార్లకు ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు తొమ్మిది నెలల కాలానికి సంబంధించి బార్లు నిర్వహించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 23న పరిశీలించి లాటరీ ద్వారా 24న అర్హులను ఎంపిక చేసి, దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం గూడూరు ఏఈఎస్ హరహాశ్రీని 9440902265, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ 9440902516, సూళ్లూరుపేట ఎక్సైజ్ సీఐ 9440902515, తిరుపతి కంట్రోలు రూము ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9603274401ను సంప్రదించాలని కోరారు.

అసైన్‌మెంట్ భూముల విషయమై వివాదం

స్వాధీనానికి అధికారుల చర్యలు ● కుమ్మరిపాళెంలో ఇరువర్గాల ఘర్షణ



ఆక్రమణదారులతో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

చిట్టమూరు, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిన భూముల విషయమై నెలకొన్న వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. చిట్టమూరు మండలం బురదగాలి పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాళెం గ్రామంలో సర్వే నెంబర్ 16లో 9ఎకరాల భూమిని గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చారు. అయితే గిరిజనులు చాలా ఏళ్లుగా స్థానికంగా నివాసం లేకపోవడంతో కోట మండలానికి చెందిన వైసీపీ నేత దగ్గర పనిచేసే హరికృష్ణ అనే వ్యక్తి సదరు భూములను స్వాధీనం చేసుకున్నాడు. దీనిపై కుమ్మరిపాళెం గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ చెప్పగా, ఇందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో సదరు భూముల్లోకి ఎవరూ ప్రవేశించవద్దంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంగా హరికృష్ణ వివాదాస్పద భూముల్లో వరి పంట సాగు చేశారు. దీంతో ఆ భూములను స్వాధీనం చేసుకొనేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం కుమ్మరిపాళెం గ్రామానికి చేరుకున్నారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ అధికారులకు వివరించారు. అయితే అసైన్‌మెంట్ పట్టా పొందిన వారే భూములను సాగు చేసుకోవాలని, లేదంటే స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని గిరిజనులు భూములను అమ్మలేదని, ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని చెప్పారు. దీంతో గ్రామస్తులకు హరికృష్ణ, అతని సోదరుడు రామ్ కుమార్ మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, వివాదాస్పద భూములపై సర్వే చేయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

ఎయిర్‌పోర్టులో శ్రీవాణి కౌంటర్ల పరిశీలన



రేణిగుంట/ తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఎయిర్‌పోర్టులోని శ్రీవాణి టికెట్ల కౌంటర్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. భక్తుల నగదు చెల్లింపులు, టికెట్లు, రసీదు జారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ వివరాలపై కౌంటర్ సిబ్బందిని విచారించారు. టికెట్లపై పలువురు భక్తుల అభిప్రాయాలు స్వీకరించారు.

ఆటో దొంగలు

జల్సాల కోసం చోరీలు.. ఇద్దరి అరెస్టు



ఆటోలతో పాటు నిందితులను చూపుతున్న క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ మంచి మిత్రులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. జల్సాలు, వ్యసనాలకోసం దొంగతనాల వైపు అడుగులు వేశారు. కడప, తిరుపతి జిల్లాల్లో ఆటోలను దొంగలించి అమ్మే.. ఈ ఇద్దరిని తిరుపతి క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. క్రైం డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. స్నేహితులైన రేణిగుంట మండలం వేణుగోపాలపురానికి చెందిన దొడ్డి కార్తీక్, తిరుపతి సింగాలగుంటకు చెందిన కె.లలితకుమార్ చెడు అలవాట్లకు బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తొలుత మేకలను దొంగతనం చేసి సంతల్లో విక్రయించి ఆ డబ్బును పంచుకుని విలాసాలకు ఖర్చు పెట్టేవారు. కొంత కాలంగా కడప జిల్లా ఓబులవారిపల్లి, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆటోలను దొంగలించి విక్రయించే వారు. ఆ డబ్బుతో జల్సాలు చేసేవారు. ఇటీవల కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ పెద్దరత్తయ్య, ప్రకాష్‌కుమార్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బసవరాజు, కానిస్టేబుళ్ళు నాగరాజు, ప్రసాద్, మోహన్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆటో దొంగలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు ఆటోలు దొంగిలించినట్లు చెప్పడంతో వారి నుంచి రూ.6 లక్షల విలువైన నాలుగు ఆటోలను సీజ్ చేశారు.

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 90 వినతులు



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 90 వినతులు వచ్చాయి. అదనపు ఎస్పీలు నాగభూషణం, రవిమనోహరాచారి, ఎస్పీ సీఐ శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు పంపి, పరిష్కరించాలని ఆదేశించారు.

అమ్మో.. పులి!

● వేద వర్సిటీలో భయాందోళన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వేద విశ్వవిద్యాలయంలో పులి సంచారం ఆందోళన కలిగిస్తోంది. రెండు వారాల క్రితం పద్మావతి హాస్పిటల్ - వేద వర్సిటీ లైబ్రరీ మధ్య రాత్రి 9 గంటల సమయంలో పులి కనిపించింది. పులిని చూసిన విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. మూడు రోజుల ముందు మరోసారి వేద వర్సిటీకి అలిపిరి రోడ్డు వైపు ఉన్న ఆర్చి వైపు నుంచీ ప్రవేశించిన పులి ఏడీ బిల్డింగ్ సమీపానికి వచ్చినట్టు తెలుస్తోంది. అక్కడ్నుంచి జింకను తరుముకుంటూ అకడమిక్ బిల్డింగ్ వైపు పులి వెళ్ళినట్టు విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది గమనించినట్టు సమాచారం. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు యూనివర్సిటీ నుంచీ సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు అధికారులు సోమవారం యూనివర్సిటీకి వచ్చి పరిస్థితిపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. పులి సంచారం నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప వెలుపలకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ సిబ్బంది గస్తీ కాస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ భవాని ప్రసాద్ - జస్టిస్ వేలుమణి

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఉడిపిలోని చిత్తాపూర్ మఠాధిపతి విద్యేంద్ర తీర్థ స్వామి, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవానిప్రసాద్, కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి, తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి సతీమణి రాధ ఉన్నారు.



విద్యేంద్రతీర్థ స్వామి - రాధ

పాపవినాశనం వద్ద ప్రత్యేకంగా పెట్రోలింగ్



సుదర్శన్‌రెడ్డి

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల పాపవినాశనం వద్ద అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న దుకాణాలను అడ్డుకునేందుకు ప్రత్యేక పెట్రోలింగ్ బృందం ఏర్పాటు చేసినట్లు తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం పాపవినాశనం స్థల విశిష్టతను తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డును కొందరు తొలగించారని, మళ్లీ ఏర్పాటు చేయించి, దాన్ని ఎవరు తొలగించారనే దానిపై విచారణ చేపట్టామని పేర్కొన్నారు. బోర్డు కటింగ్ చేయడానికి కాంట్రాక్టర్‌కు అప్పగించిన జనరేటర్‌ను వినియోగించారని గుర్తించామని, విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రచారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక పెట్రోలింగ్ బృందాన్ని నిఘా ఉంచామని పేర్కొన్నారు.

నగరి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

లారీ సహా 19 టన్నుల బియ్యం సీజ్ ● ఎస్పీ ప్రత్యేక బృందం దాడుల్లో పట్టుబడిన వైనం



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో అన్‌లోడ్ చేస్తున్న కూలీలు


పుత్తూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరి కేంద్రంగా రేషన్ బియ్యం పక్కరాష్ట్రాలకు అక్రమ రవాణా అవుతోంది. గతంలో పుత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యం పక్కదారి పట్టించి రూ.2.50 కోట్ల మేర అవినీతికి పాల్పడిన సీఎస్ డీటీ జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు. అయినా వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. నగరి, పుత్తూరు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే జిల్లా ఎస్పీ పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. అర్ధరాత్రి వేళ రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా అడ్డుకుంది. ప్రత్యేక బృందం రంగ ప్రవేశంతో బియ్యం అక్రమ వ్యాపారుల వెన్నులో వణుకుపుడుతోంది. నగరి నుంచి పుత్తూరు మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్న రూ.8.62 లక్షల విలువైన 19 టన్నుల రేషన్ బియ్యం సోమవారం పట్టుబడింది. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం ఈ అక్రమ రవాణాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం పట్టుబడిన బియ్యం సహా లారీని ప్రత్యేక బృందం పుత్తూరు పోలీసులకు స్వాధీనం చేసింది. సోమవారం వేకువజామున 3 నుంచి 4 గంటల మధ్య పుత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని పీఆర్ మంగళం సమీపంలోని రాజస్థాన్ దాబా వద్ద ప్రత్యేక బృందం కాపుకాసింది. ముందస్తు సమాచారం మేరకు లారీని ఆపి తనిఖీ చేసింది.లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు నిర్ధారించుకుంది. నగరికి చెందిన బియ్యం వ్యాపారి పొడుగు బాలా, పొన్నుస్వామి, గణేష్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నగరి దేశమ్మ ఆలయ సమీపం నుంచి 50 కిలోల చొప్పున 375 బస్తాలను లారీలో లోడ్ చేయించినట్లు డ్రైవర్ యువరాజ్(31) తెలిపారు. కరాటక రాష్ట్రం బంగారుపేట ఆర్కే రైస్ మిల్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసిన పోలీసలు పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్‌సి పాయింట్‌కు తరలించారు. లారీని సీజ్ చేశారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వ్యాపారులను, రైస్ మిల్లు యజమానికి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

తిరుమలలోనూ ఇకపై హెల్మెట్ తప్పనిసరి

అమలుపై అధికారుల కసరత్తు

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోనూ ఇకపై ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులు నిర్ణయించారు. ప్రమాదాల నివారణ కోసం ఇప్పటికే కొన్నేళ్లుగా తిరుమల మొదటి, రెండో ఘాట్‌లో హెల్మెట్ తప్పనిసరి నిబంధన కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా, తిరుమలలో తిరిగే ద్విచక్రవాహనదారులకు కూడా హెల్మెట్ తప్పనిసరి చేయాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం కొన్ని ప్రాంతాల్లో భక్తులు, స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులకు హెల్మెట్ పెట్టుకుని డ్రైవ్ చేయాలని సూచించారు. ఇక, అతి తక్కువ పరిధిలో ఉండే తిరుమలలో ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్లే అవకాశం ఉండదు. అలాంటప్పుడు తిరుమలలో హెల్మెట్ నిబంధన అవసరమా అనే చర్చ మొదలైంది. అయితే ద్విచక్రవాహనదారుల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఈ నూతన నిర్ణయాన్ని అమలుచేయాలనే ఆలోచన చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

సీమ పందుల పెంపకంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి



జ్యోతి వెలిగిస్తున్న డీఈ శోభామణి, డీఆర్ శ్రీలత

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ పద్ధతుల ద్వారా వాణిజ్య సరళిలో సీమపందుల పెంపకాన్ని చేపట్టి వ్యాపారవేత్తలుగా ఎదగాలని వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత తెలిపారు. 'శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం' అంశంపై రైతులు, యువతకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీమపందుల పెంపకం ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ శోభామణి ఆకాంక్షించారు. సీసీపీఈసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, ఏఐసీఆర్‌పీ ప్రధాన శాస్త్రవేత్త కల్యాణచక్రవర్తి, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య

● బంగారు నగలు అపహరించిన నిందితులు


● పాడిపేటలో కలకలం



హత్యకు గురైన జీవరత్నమ్మ

తిరుచానూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేటలో ఓ వృద్ధురాలు హత్యకు గురైన ఘటన సోమవారం సాయంత్రం వెలుగుచూసింది. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ కథనం మేరకు.. పాడిపేట మాజీ సర్పంచ్ దివంగత గణేష్‌శెట్టి భార్య జీవరత్నమ్మ(63) తన కుమార్తె లలితతో కలిసి నివాసం ఉంటోంది. నారాయణవనంలోని ఐఆర్‌డీఎస్ సంస్థలో లలిత ఉద్యోగిని. సోమవారం ఉదయం ఆమె విధులకు వెళ్లారు. ఇద్దరు మనవరాళ్లు కళాశాలకు వెళ్లారు. జీవరత్నమ్మ ఒకరే ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం పక్కనే దుకాణానికి మిద్దెపైనుంచి దిగి వచ్చారు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు. సాయంత్రం 5.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన లలిత.. మొదటి అంతస్తులో తలుపులు తెరచివుండటం, బెడ్‌పై విగతజీవిగా పడి ఉన్న తల్లిని చూసి నిశ్చేష్టురాలయ్యారు. సమాచారం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, క్లూస్‌టీం చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి మొదటి అంతస్థుకు చేరుకుని జీవరత్నమ్మ నోటిని గుడ్డతో అదిమిపెట్టి ఊపిరి ఆడకుండా హత్య చేసి మెడలో ఉన్న వంద గ్రాముల బంగారు నగలను లాక్కెళ్లినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసి జీవరత్నమ్మ మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు కూలీలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు అస్వస్థతకు గురయ్యారు. దీనికి కలుషిత ఆహారం కారణమని భావిస్తున్నారు. ఈ సంఘటన సోమవారం వెంకటగిరి మండలం చెలికంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగరాజు అనే రైతు పొలంలో వరి నాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు మధ్యాహ్నం వరకు నాట్లు వేశారు. వీరికి పొలం వద్దే యజమాని మధ్యాహ్నం ఆహారాన్ని వండించారు. అందరూ కలిసి ఈ ఆహారాన్ని తిన్నారు. కొంతసేపటికి కొంతమంది కూలీలకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో 14 మంది కూలీలను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని కూలీలు ఆరోపిస్తున్నారు. దీంతో వీరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. కలుషిత ఆహారమే దీనికి కారణమని భావిస్తున్నారు. కాగా, వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు దారుణంగా ఉందని రైతులు కృష్ణయ్య, రమణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. వైద్యం కోసం వచ్చిన బాధితులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డీహెచ్ఎస్ ఆనంద మూర్తితో ఫోన్‌లో మాట్లాడారు.

చెరువులను అభివృద్ధి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిపొందినవారు వారి పరిధిలోని చెరువుల అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికైనా అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలో 105 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా కూటమి అభ్యర్థులు ఏగ్రీవంగా ఎన్నికవడం ఆనందదాయకమన్నారు. ఎన్నికైనా అభ్యర్థులు తమ పరిధిలోని చెరువులను అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకుని ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూర్చలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను అభివృద్ధి పరిచి సాగును విస్తీరింపజేసేలా చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, నల్లపురెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, కిషోర్ నాయుడు, జలీల్ అహ్మద్, వెంకటేశ్వర్లు రెడ్డి, కోటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులకు సేవాదృక్పథం ఉండాలి: కురుగొండ్ల



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు వ్యాపారాభివృద్ధితో పాటు సేవాదృక్పథంతో పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం వెంకటగిరి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాంకులు రైతులు, విద్యార్థులకు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్ బ్యాంకు క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, సామల లక్ష్మీపతి, అవ్వారు సత్యం, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి వెంకటరెడ్డి, తోట కృష్ణయ్య పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ



అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు నివాళ్ళు అర్పిస్తున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్, సిబ్బంది

చిట్టమూరు, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై చిట్టమూరు స్త్రీసంక్షేమ భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ పలు అంశాలపై వివరించారు. 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు తొమ్మిది బృందాల ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలను అమలు పరిచేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ జనార్దన్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఏపీఎం గున్నయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో శిక్షణ తరగతులు

దొరవారిసత్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై ఈనెల 18, 19 తేదీల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోవర్ధన్ తెలిపారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, మండలస్థాయిలో అన్నిశాఖల అధికారులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

రెండు రోజుల శిక్షణ

నాయుడుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు.

పట్టాభి రామాలయంలో ధనుర్మాస పూజలు



వాకాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన పట్టాభి రామాలయంలో సోమవారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి సుప్రభాతసేవ, తిరువారాధనం సేవా, సామూహిక అభిషేక అర్చనలు, తిరుప్పావై, కుంకుమార్చనలు, బిందె తీర్థం, ప్రభాస కాళార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు దివి అనంతాచార్యులు పేర్కొన్నారు. జనవరి 13 వరకు జరిగే కార్యక్రమాలకు ఉభయ కర్తగా కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి వ్యవహరిస్తారు.

వైష్ణవ ఆలయాల్లో...

గూడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కర్నాల వీధిలోని భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో భక్తులు తిరుప్పావై పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా నెల రోజులు పాటు తిరుప్పావై పూజల్లో సుప్రభాత పారాయణం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

చదువులపై విద్యార్థులు శ్రద్ధ చూపాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి విద్యార్థులు చదువులపై శ్రద్ధ చూపాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా నగర్‌లోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు రామచంద్రయ్య దాతృత్వంతో విద్యాసామగ్రి, భోజనం ప్లేట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంతమ్మ, సుధాకర్‌రాజు, చంద్రయ్య, చక్రవర్తి, కృష్ణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న టీడీపీ నాయకుడు చెంచురామయ్య

బార్‌కు దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బార్ అండ్ రెసారెంట్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎక్సైజ్ సీఐ అరుణ కుమారి తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 16నుంచి 22వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చుఅన్నరు. 23వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 24న జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో డ్రా తీసి లైసెన్స్ కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

18న ద్విచక్ర వాహనం వేలం

వెంకటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 18వ తేదీన వేలం వేయనున్నట్లు వెంకటగిరి ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

అంగన్‌వాడీ భవనానికి గ్రహణం

పదేళ్లయినా పూర్తికాని నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం

కోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ వజ్జవారిపాళెంలో పదేళ్ల క్రితం చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు గోడలకే పరిమితమై ఉంది. 2014-16 విద్యా సంవత్సరంలో రూ.7.5 లక్షల ఉపాధి నిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గోడలు నిర్మించారు. అప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు డ్రా చేసుకున్నారు. ఆ తరువాత పనులు కొనసాగించలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అంగన్‌వాడీ భవన నిర్మాణం గోడలకే పరిమితమయ్యాయి. దీంతో స్థానికంగా ఉన్న పాఠశాల భవనంలోనే అంగన్‌వాడీ చిన్నారులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై సీడీపీవో మునికుమారితో మాట్లాడగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు.

పరిహారం తీసుకుని పంటలు సాగు చేయడం సరికాదు

కోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు విస్తరణకు ఇచ్చిన భూముల్లోకి రైతులు వెళ్లొద్దని తహసీల్దారు జయజయరావు కోరారు. మండల పరిధిలోని ఉనుగుంటపాళెం, రుద్రవరం, మైక్రోటవర్ కాలనీల సమీపంలో ఉన్న భూములను సోమవారం తహసీల్దారు జయజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల పరిధిలో రైతుల పట్టా భూములను సాగరమాల రోడ్డు విస్తరణకు తీసుకోవడం జరిగిందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపు దాదాపుగా పూర్తయిందని తెలిపారు. అయితే కొంతమంది రైతులు పరిహారం పొందినప్పటికీ తిరిగి అదే భూముల్లో మళ్లీ పంటలు సాగుచేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రోడ్డు పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో పరిహారం పొంది కూడా పంటలు సాగు చేయడం ఏమిటని రైతులను ప్రశ్నించారు. పంటలను తక్షణమే తొలగించాలని తహసీల్దారు హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఊనుగుంటపాళెంలో సాగరమాల నిర్మాణానికి తీసుకున్న భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు జయజయరావు, రెవెన్యూ సిబ్బంది


ఈ దారిలో వెళ్లేదెలా?



బురద నీటితో నిండిన రోడ్డు

దొరవారిసత్రం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో దళిత కాలనీ రోడ్లు బురదమయంగా మారాయి. ప్రధాన రహదారి నుంచి దళిత కాలనీకి వెళ్లే దారిలో వర్షపు నీరు నిల్వ చేరడంతో రొచ్చురొచ్చుగా మారింది. దీంతో ఆ మార్గంలో వెళ్లడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి దారిని బాగు చేయాలని కోరుతున్నారు.

నెలవలకు సన్మానం



టీడీపీ నాయకులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో నెలవల

ఓజిలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యంను ఆ పార్టీ నాయకులు, నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు సోమవారం సన్మానించారు. నాయుడుపేటలోని ఆయన స్వగృహంలో ఓజిలి మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో గున్నం సేవాట్రస్టు అధినేత గున్నం మధురెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, భువనగిరిపాళెం, జోస్యులవారికండ్రిగ సాగునీటి సంఘాల అధ్యక్షులు శంకరరాజు, రాజా సన్మానించారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె ఖలీల్, యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, సీనియర్ నాయకులు బచ్చల రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్ల పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పక్కనే రోటరీ మాజీ అధ్యక్షురాలు ప్రతిమ, శాంతకుమారి

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను పురష్కరించుకొని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య చేతుల మీదుగా దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శ రామకృష్ణ, మాజీ అధ్యక్షురాలు సుంకర ప్రతిమ, తన్నీరు శేషగిరిరావు, నాదెండ్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే కురుగొండ్లను కలిసిన రావిళ్ల



కురుగొండ్లను సన్మానిస్తున్న రావిళ్ల

బాలాయపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కయ్యూరు గ్రామానికి చెందిన రావిళ్ల వెంకటకృష్ణమ నాయుడు సోమవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా చెయ్యేరు నదీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం జాండ్రపేంట ఎఫ్‌బీవోతో కలిసి ఆదివారం గుర్రపుబాట తూర్పువైపు ఉన్న చెయ్యేరు వద్ద కూబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున మేకలకోన వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా దుంగలు పడేసి పారిపోయారు. వెంటపడి ఒకరిని పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో పరిశీలించగా ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, పట్టుబడ్డ స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని శ్రీసిటీ కార్మికుడి మృతి

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సిరాపురం దినేష్(26) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతికి చెందిన దినేష్ శ్రీసిటీలో పనిచేస్తున్నాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి సూళ్లూరుపేటలోని స్వతంత్రపురంలో గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సోమవారం జనరల్ షిఫ్ట్ కావడంతో దినేష్ విధులకు వెళ్లలేదు. రాత్రి స్నేహితులు వచ్చి చూడగా గదిలో ప్యాన్‌కు ఉరేసుకొని కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైదాపురం ఎంపీడీవోకు స్వల్పగాయాలు

గూడూరు అర్బన్, డిసెంబరు 16,(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని తిప్పారపాడు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదాపురం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. శివకుమార్ సోమవారం మోటర్ సైకిల్‌పై గూడూరు నుంచి సైదాపురానికి వెళ్తుండగా తిప్పారపాడు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

'ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం'

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి డ్రైనేజీ, ఇంటి స్థలాలు తదితర సమస్యల 15 అర్జీలు అందాయి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని కమిషనర్ చెప్పారు.

ఈ క్రాప్ నమోదుపై శిక్షణ

కోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఈ క్రాప్‌పై సహాయ వ్యవసాయ సేవకులకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల వారీగా సహాయ వ్యవసాయ సేవకులకు ఈ క్రాప్‌పై నమోదుపై అవగాహన కల్పించారు.

ప్రజల వద్దకే రెవెన్యూ యంత్రాంగం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల వద్దకు అధికారులను పంపి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఇరుగు వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని మోదుగులపాలెంలో తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 15 మంది రైతులు అర్జీలు అందజేశారు. ఇందులో 5 మంది భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో వంశీకృష్ణ, సర్వేయర్ పూజిత, సూర్యనారాయణ, వీఆర్ఏ అల్లాకుల కృష్ణ, శైలజ, టీడీపీ నాయకులు గుంటపూడి గురవయ్య, గంగాబత్తిన వెంకటకృష్ణయ్య, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మనవాలిలో రెవెన్యూ సదస్సు

ఓజిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మనవాలిలో తహసీల్దారు పద్మావతి అధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పిగిలాం, జార్లపాడు గ్రామాల్లో...

బాలాయపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండలంలోని పిగిలాం, జార్లపాడు గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 9, పక్కా గృహాల కోసం 4అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, తాకరరామారావు, కూటమీ నాయకులు ముప్పాళ్ల మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళకు ఎమ్మెల్యే చేయూత



బాధితురాలికి నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరులో నివసిస్తున్న రాజేశ్వరి ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో నిరాశ్రయురాలైంది. సోమవారం నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బాధిత మహిళకు రూ.10వేల నగదు అందజేశారు.

ఆమె ఎందుకొచ్చినట్లు?

వెంకటగిరి ఎమ్మెల్యే ఇంటికొచ్చిన వైసీపీ మహిళా నేతను అడ్డుకున్న కార్యకర్తలు

వెంకటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఇంటి వద్దకు వైసీపీ మహిళానేత ఒకరు వచ్చారు. కార్యకర్తలు ఆమెను అడ్డుకున్నారు. సోమవారం జరిగిన ఈ సంఘటన పట్టణంలో చర్చగా మారింది. గతంలో తెలుగుదేశంలో ఉండి ప్రస్తుతం వైసీపీ మహిళా విభాగంలో నాయకురాలుగా ఉన్న ఆమె తిరిగి దేశం గూటికి చేరేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులతో తన నివాసంలో ఎమ్మెల్యే కురుగొండ్ల సమావేశమై ఉన్న సమయంలో ఆ మహిళా నేత వచ్చారు. ఇక్కడేం పని అంటూ కార్యకర్తలు ఆమెతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆమె ఎమ్మెల్యేను కలవకుండానే వెనుదిరిగిపోయినట్లు తెలిసింది.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయండి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్లను అక్రమంగా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ విషయమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అంకయ్య, రాము, శ్రీధర్, శేషయ్య, శ్రీనివాసులు, శివకుమార్, సురేష్, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

డక్కిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించాలని పంచాయతీ విస్తరణ అధికారి అల్లాభక్షు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాతనాలపాడు, వెంబులూరు, నాగవోలు, పలుగోడు సచివాలయాల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమావేశమై ప్రతిపాదిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులతో పాటు నిధులు విడుదల అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సంతానేశ్వరిస్వామి సేవలో కొండేపాటి



సంతానేశ్వరస్వామి ఆలయం వద్ద కొండేపాటి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరులో ఉన్న సంతానేశ్వరస్వామిని ప్రముఖ పారిశ్రామివేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగా ప్రసాద్ సోమవారం దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం, పాముూరు మునస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంచొద్దు



టవర్ క్లాక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంపుదలను వెంటనే ఆపాలని సీపీఎం నాయకుడు శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ వద్ద సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ బిల్లుల జిరాక్స్ కాపీలను దహనం చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్ ఛార్జిలను తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్, శంకరయ్య, చంద్రయ్య, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

గూడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కడివేటి హర్షవర్ధన్ దాతృత్వంతో గౌరి అనే మహిళకు కుట్టు మిషన్‌ను అందజేసింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యాం యాదవ్ మాట్లాడుతూ పేదలకు చేయూతనందిచేలా ప్రగతి సేవాసంస్థ కార్యక్రాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివా సులు, ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.



కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్న ప్రగతి సేవా సంస్థ సభ్యులు